జీవన యానం

"ప్రఖ్యాత ఫ్రెంచి సామాజిక అర్థ శాస్త్రవేత్త ప్రసంగం వినాలని విక్రాంత్ పట్టుపట్టి ఎంతో మేలు చేశాడు. అమర్త్య సేన్ సంక్షేమ అర్థశాస్త్రం కన్నా క్యాపిటల్ – సోషల్ ఎకానమీ (పెట్టుబడి – సామాజిక అర్థశాస్త్రం) ఎంతో సమగ్రంగా ఉందనిపిస్తోంది. ఇది సోషలిస్టు దృక్పథానికి దగ్గరగా ఉందనిపిస్తోంది." అంది ఉస్మానియా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతున్న రాధ అరవింద్‌కేసి చూస్తూ.

అరవింద్ ఆరాధనగా రాధకేసి చూస్తూ నవ్వాడు. రాధను కల్సుకోవడానికి ఇదొక మంచి ప్రదేశం అని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ బయల్దేరదీసింది అరవిందే. నీ వెంట నేనూ వస్తా అని లత వెంటపడితే ఎలాగోలా తప్పించుకున్నాడు అరవింద్. ఆమె తనను లైక్ చేస్తోందని తెల్సు, కాని అరవింద్ రాధను లైక్‌చేస్తాడు.

"నిన్న ఉస్మానియా క్యాంపస్ సెమినార్‌లో మాట్లాడింది అద్భుతంగా

ఉందనే కదా యివాళ మిమ్మల్ని తప్పక రమ్మన్నది" అంటూ వాచీకేసి చూశాడు విక్రాంత్.

సాయంత్రం నాలుగున్నరవుతోంది. కొందరు గుంపులుగా చేరి ప్రసంగం గూర్చి చర్చించుకుంటున్నారు. ఒక గుంపులో లత కనపడి గతుక్కుమన్నాడు అరవింద్. విక్రాంత్ అటుకేసి చూశాడు. ఆమె అరవింద్ కేసి కోపంగా చూడ్డం ఎందుకో విక్రాంత్‌కు అర్థంకాలేదు.

ఫస్టుఫ్లోర్ మెట్లు దిగుతూ టైటానిక్ మరోసారి చూద్దామా అంది రాధ అరవింద్‌కేసి అదోలా చూస్తూ. అక్కడే ఏకాంతం లభిస్తుందని ఆమె ఉద్దేశం.

"మీరెళ్ళండి. నాకు పని ఉంది." అంటూ విక్రాంత్ వారి మధ్య తానెందు కన్నట్టు తప్పించుకో చూశాడు. ఆ మాటతో రాధ ముఖం వికసించింది.

విక్రాంత్‌కు యిలాంటివి గిట్టవు. ఆ స్తోమతాలేదు. తండ్రి లేడు, తల్లీ చెల్లె సావిత్రి బీడీలు చేస్తూ చదివిస్తే క్యాంపస్ దాకా వచ్చిన వాడు. అన్నయ్య ఎదిగి మంచి సంబంధం చూసి తన పెళ్ళి చేస్తాడని చెల్లెలి ఆశ.

"సిన్మాకు రాకపోయినా కనీసం తందూర్ రోటీ తినేదాకా కంపెనీ యివ్వాలి. మీ చెల్లెలంత కాకపోయినా ఈ చెల్లెలూ ప్రేమతో నీకు కాస్త గోరుముద్దలు తినిపిద్దామని" నవ్వుతూ అంది రాధ. సరేనంటూ ముగ్గురు మెట్లుదిగి హోటల్‌కి నడిచారు.

టైటానిక్ సిన్మా చూసి అరవింద్ హాస్టల్ రూం చేరేసరికి ఇంటినుంచి వచ్చిన ఉత్తరం మంచంపై పడి ఉంది. రూమ్మేటు దాన్ని అక్కడ ఉంచినట్టున్నాడు. చింపి చదివాడు.

ఇంటర్ ఫేలై బట్టల షాపులో జీతం ఉన్న తమ్ముడు ఆనంద్ రాసిన ఉత్తరం. నాన్నకు ఆరోగ్యం బాగాలేదని వెంటనే బయల్దేరి రమ్మని ఉత్తరం సారాంశం. కనీసం ఇన్‌లాండ్ లెటరైనా రాయండి – కార్డులు రాస్తే అందరూ చదువుతారు బాగుండదని చెప్పిన్నించి తమ్ముడు ఇన్‌లాండ్ లెటర్లే రాస్తున్నాడు.

టైటానిక్ సినిమా చూస్తూ తాను, రాధ కళ్ళతో హృదయాలు కలుపుకున్న ఉత్తేజం, చేతుల్లో వేళ్ళు బిగించి కాళ్ళతో. కాళ్ళు తాకించి అనుభవించిన స్పర్శా సుఖం, కన్నకలలపై ఆ ఉత్తరం నీళ్ళు చల్లినట్టయింది. రాధను పెళ్ళి చేసుకొన్నాక గడుపబోయే మధురమైన జీవితం గురించిన ఊహలకు అడ్డుకట్టపడింది.

పదిరోజుల క్రితం రాసిన ఉత్తరంలో అందరూ బాగున్నారని రాశారు.

ఇంతలోనే ఏమిటా అని ఆందోళనపడ్డాడు అరవింద్.

టైం చూసుకున్నాడు రాత్రి తొమ్మిదిన్నరవుతోంది. రాత్రి ఒంటి గంటదాకా జగిత్యాలకు బస్సులున్నాయి.

తొందరేంలేదు అనుకుని మెస్సుకే దారి తీశాడు.

భోజనం అయ్యాక ఒక డ్రెస్సు బ్యాగులో పడేసుకుని రూమ్మేటుకు చెప్పి బయలుదేరాడు.

ఇమ్లీబన్ బస్టేషన్లో రడీగా ఉన్న బస్సెక్కాడు అరవింద్.

కిటికీ పక్కన సీటు దొరికింది.

ఈసారి రాధ విషయం నాన్నకు చెప్పాలి అనుకున్నాడు అరవింద్.

❖ ❖ ❖

"మూడు రోజుల్నుంచి మల్లా ఛాతీనొప్పి ఒకటే దగ్గు, మగ్గం నేసుడు సాత్తనైత లేదు. అప్పు పెరుగవట్టె" అంటూ అరవింద్ నాన్న చంద్రయ్య మరోసారి దగ్గాడు.

"ఉస్మానియాలో కొద్ది రోజులు యిన్‌పేషంటుగా ఉండునాన్న అంటే నాకేమైంది అంటావు. అన్నీ నేను చూసుకుంటా ఈసారి పోదాం నాన్నా."

"శాతగాకుంటైతే-దావుకాన్లు ఏం చేస్తయిరా, ఏం రోగం లేదని నువ్వే అంటివి" అన్నాడు చంద్రయ్య.

పోషకాహారలోపమే పేద దేశాల్లో అన్నిటికన్నా పెద్ద జబ్బు. అన్న ఫ్రెంచి సామాజిక అర్థశాస్త్రవేత్త మాట గుర్తొచ్చి తను పేదరికం గురించి, కుటుంబ స్థితిగతుల గూర్చి ఆలోచనలో పడ్డాడు అరవింద్.

"నారాయణన్న నువ్వస్తే ఓసారి వచ్చి నిన్ను కలుస్తానన్నడు. నాన్నను చూసుటానికి నిన్న వచ్చినప్పుడు చెప్పిండు." అంది తల్లి దేవక్క.

"నేనే కల్సి వస్తనే" అన్నాడు అరవింద్.

చిన్నప్పట్నించి నారాయణసేటు అనిపిలిచిన అమ్మ అతన్ని కొంతకాలంగా నారాయణన్న అనడం గమనిస్తున్నాడు అరవింద్. నారాయణ సేటు బిడ్డ నిర్మల జగిత్యాల్లో బి.ఎస్సీ చదువుతోంది. మెడిసిన్‌లో అరవింద్‌కు సీటు వచ్చిన్నుంచి నారాయణ ప్రవర్తనలో మార్పు వస్తోంది. అతని కూతుర్ని అరవింద్‌కివ్వాలని ఆశ.

"పది లక్షలు యిస్తడు. పిల్ల ఎంతో చక్కదనంగా ఉన్నది. డాక్టరు పిల్లనే

చేసుకుంటే ఏం సుఖంరా ఎపుడూ పనే. ఈ పిల్లను చేసుకుంటే ఇంటిపట్టున ఉంటది" అంది తల్లి దేవక్క

నారాయణ సేటును అరవింద్ చిన్నప్పట్నించీ ఎరుగును.

నారాయణ పెద్దసేటు. నూలు, బట్టలు, రంగుల వ్యాపారం. మొదట్లో అతడు చేనేత సహకార సంఘంలో బాగా పనిచేశాడు.

సబ్సిడీ మీద వచ్చిన నూలును బ్లాకులో అమ్ముకొని బంగ్లాలు కట్టాడని, సంఘాన్ని ముంచాడని చాలా మంది అతని వెనక విమర్శిస్తుంటారు. చాలా కాలం కులసంఘం కోసం అతను ఎంతో చేశాడని పెద్దవాళ్ళు అంటుంటారు. అరవింద్‌కు అవి నమ్మబుద్ధికాదు.

నారాయణ సేటు తండ్రి కూడా బట్టలు నేసి పులిసిన అంబలి జుర్రి బతికినవాడే. సంఘాన్ని ముంచకపోతే నారాయణ సేటు బంగ్లా ఎట్లా కట్టాడు. ఎట్లా పెరిగాడు. అతడు కులసంఘంలో నాయకుడుగా ఉన్నది తన పెద్దరికం కోసమే కాకుండా, తనకు వ్యతిరేకంగా విమర్శించేవాళ్ళు సంఘంలో ఎదగకుండా చేయడం కోసం తప్ప సంఘానికి సేవ చేయాలనే ఉద్దేశ్యం అతనికేమాత్రమూ లేదు అని అరవింద్ అభిప్రాయం.

అరవింద్‌కు బుద్ధి తెల్సేనాటికి నారాయణ సామాజికంగా నిర్వహించే ప్రగతిశీల పాత్ర ముగిసిపోయింది. వ్యక్తిగత స్వార్థంకోసం యువ నాయకత్వాన్ని ఎదగకుండా చేస్తున్న వాడిగానే అరవింద్‌కు తెల్సు. సంస్థ నడిస్తే అతని పెద్దరికానికి ముప్పు. అందుకని ఏ సంస్థనైనా నడవకుండా చేయడం, ఎంత ఉత్సాహవంతుడైన యువకుడినైనా నీరుగార్చడం, నీచంగా మాట్లాడం అతని పని. పైగా పెద్ద సేటు అని అతనికి పేరు.

అరవింద్ నాన్న తన చదువు గురించి చెప్పి అప్పు అడిగితే నారాయణ సేటు ఏమన్నాడో బాగా గుర్తుంది. హైదరాబాద్‌లోని పద్మశాలి హాస్టల్‌లో సీటు యిప్పించమని బతిమాలితే తనను చూసిన చూపు ఇంకా వెంటాడుతోంది. అంత సిరివచ్చిందా నీకు అని ఒక దుర్మార్గుడైన భూస్వామి చూసే చూపు అది.

"చంద్రయ్యా! పిల్లగాన్లు ఏదడిగితే అది నీతోని ఎట్లయితది, వాల్లు తెల్సీ తెల్వక ఎన్నో కోరుతారు. పద్మశాలి హాస్టల్లో సీటంటే మాటలు కాదు. అది ఉత్తగరాదు. దానికి పెద్ద తతంగం ఉన్నది. నీ కొడుకు అసోంటోల్లు ఎంత మంది. ఎంసెట్ కోచింగ్‌కు అప్పు చేస్తే సీటు రాకపోతే ముప్పయి వేలు మీద

పడుతై గద. మంచం ఉన్నంతల కాళ్ళు చాపాలె. ఇంటర్ ఫస్ట్ క్లాసుల పాసైనోనికి టీటీసిల సీటురాదా! టీచర్ ట్రైనింగ్ చేస్తే తర్వాత బి.ఎస్సీ, ఎమ్మెస్సీ, పిహెచ్.డి చేసి లెక్చరర్ కావచ్చు. ముందు తన కాళ్ళ మీద నిలబడే ఆధారం దొరకనీ. గీ బట్టలు నేసుకుంట డాక్టరు కోర్సు సదివించుడు నీతోటి ఎట్లయితది."

ఆ మాటతో అరవింద్‌కు చాలా కష్టం వేసింది. నిర్మలతోని సంబంధం ఖాయం చేసుకుంటే నేనే పెట్టుబడి పెట్టి చదివిస్త. నిర్మలను చేసుకోకపోతే పెట్టిన పెట్టుబడి బ్యాంకు వడ్డీతోని చెల్లుగట్టాలె. డాక్టరు సీటువస్తే తప్పక నిర్మలను చేసికోవాలె మరి. ఏమంటావు అరవింద్? అని తనను నారాయణ సేటు అల్లున్ని చేసికొని ప్రోత్సహిస్తాడనుకున్నాడు అరవింద్.

నారాయణ సేటుకా ఉద్దేశం లేదని తెల్సిపోయింది.

తాను పేరుకు బి.ఎస్సీలో జాయినై బట్టలు నేస్తూ యింటివద్దే ఏడాదంతా ఎంసెట్‌కు చదువుకున్నాడు. అయినా మూడువేల రూపాయల దాకా నారాయణ సేటు దగ్గర అప్పుచేయాల్సి వచ్చింది.

ఎంసెట్లో ర్యాంకు వచ్చాక నారాయణ సేటు తీరు మారింది. అరవింద్ తండ్రిని మర్యాద చేస్తున్నాడు. దేవక్కా తానూ అక్కా చెల్లెల్ల పిల్లలమే అనే బంధుత్వం గుర్తు చేస్తున్నాడు. రసీదు టికెట్ అయినా లేకుండా సాదా కాగితం మీద రాయించుకొని ఎంతంటే అంత అప్పులిస్తున్నాడు.

అదంతా కాబోయే అల్లుని కోసం పెడ్తున్న పెట్టుబడి అని మనస్సులో మొదట్నుంచీ ఉందేమో అని క్రితం రోజు ప్రెస్‌క్లబ్‌లో విన్నాక అరవింద్‌కు యిపుడనిపిస్తోంది.

తనని దాష్టీకంగా రమ్మని పిలిపించుకునే వాడు ఇపుడు తానే వచ్చి కలుస్తాననడం – నాన్న ఆరోగ్యం గురించి పరామర్శించి వెళ్ళడం వెనక యిదంతా ఉందనిపిస్తోంది.

నారాయణ సేటు కూతురు నిర్మల సౌమ్యంగా అందంగానే ఉంటుంది. కాని ఆ పిల్ల కష్టం ఎరగకుండా పెరిగింది. ఆమెకు పేదరికం అంటే ఒక రకమైన ఏవగింపు కూడా.

నూలు కోసం, అప్పు కోసం తానూ నాన్నా వెళ్ళినపుడు వీళ్ళు కూడా తమకులం వాళ్ళే అనే దృష్టితో ఆమె ఎన్నడూ చూడలేదు.

అరవింద్ తనకు వరసకు మేనబావ అవుతాడనే విషయాన్ని కలలో

కూడా నిర్మల సహించలేదు. నాన్న చేతి కింద, తమ చేతికింద పనిచేసే పనిమనుషులు, కూలీవాళ్ళు అన్నట్లుగా చూసేది నిర్మల.

ఇపుడు నిర్మల మారింది. కానీ అరవింద్ మరవలేదు. అరవింద్‌కు ఇప్పటికీ వాళ్ళ యింట్లో ఉన్నంత సేపు ఏదో బెరుకు స్వేచ్ఛ కోల్పోయిన ఫీలింగ్.

"అల్లబిడ్డ నిర్మల సంబంధం గురించి అడుగుతడు కావచ్చు. ఏమని చెప్తవురా" అంటూ తల్లి దేవక్క సరిగ్గానే చెప్పానా అన్నట్టు పెనిమిటికేసి చూసింది.

అనారోగ్యం మిషతో రమ్మన్నది యిందుకేనా అని అనుమాన మొచ్చింది అరవింద్‌కు. అమ్మానాన్నలు బాకీ కింద తనను నారాయణ సేటుకు అమ్మేయదల్చుకున్నారా.

బాకీ పెట్టుబడి, జీవితాభివృద్ధి కోసం పెట్టుబడి రెండూ వేరువేరు సామాజిక సంబంధాలను పరిణామాలను సృష్టిస్తాయంటాడు ఫ్రెంచి శాస్త్రవేత్త. అమెరికా ప్రపంచబ్యాంకు యిచ్చే పెట్టుబడులన్నీ బాకీ పెట్టుబడులే తప్ప నిజమైన సామాజికాభివృద్ధి పెట్టుబడి క్రమాలకు సంబంధించినవి కావు. ఆధిపత్యం స్వప్రయోజనమే వాటి అంతిమ లక్ష్యం అన్న అతని మాటలను నారాయణ సేటుకు అన్వయిస్తూ ఆలోచిస్తున్నాడు అరవింద్.

"నేనా విషయం ఆలోచించలేదే, నారాయణ సేట్‌తోని అదేమాట చెప్త. మరి మీ ఆలోచన ఎట్లున్నదే?"

రాధ విషయం ఇప్పుడే చెప్పేద్దామనే తాపత్రయంతో అరవింద్ అడిగాడు. దేవక్క పెనిమిటికేసి చూసింది.

"మన కండ్ల ముంగట పెరిగిన పిల్ల. చేసుకుంటే మంచిగనే ఉంటది" అన్నాడు చంద్రయ్య.

"మంది కొంపలు ముంచి పైకి వచ్చిండు అని ఎన్నోసార్లతిట్టివి. వాని కొంపకూల. వాని చేతులకు కుష్టువ్యాధి రాను అని ఇన్నేండ్లు తిట్టితిట్టి ఇపుడు గిట్లనవడితివెమ్మే నాయినా!" నవ్వుతూ అన్నాడు అరవింద్.

"గిట్ల చేతి కష్టం చేసినోల్లు ఎవలుపైకి వచ్చిన్రురా. ఆ పిల్లను చేసుకుంటే మన అప్పుతీరుతది. నువ్వు ఈ ఊర్లెనే ప్రాక్టీసు పెట్టుకోవచ్చు. శ్రీనివాస్ టాకీసు వెనక కట్టిన బంగ్లా కూడా మీకే యిచ్చేస్తనన్నడు." ఎంతో గొప్ప సంబంధం అన్నట్టు గర్వంగా అన్నాడు తండ్రి చంద్రయ్య.

అరవింద్‌కు అదేమంత గొప్ప సంబంధం అనిపించినట్లు లేదు. వాళ్ళ

ప్రవర్తన గుర్తువచ్చి కోపం వచ్చింది.

"అంటే వాళ్ళ పెద్ద కొడుకుతోని మెడికల్ షాపు వాళ్లే నడుపుకుంటారన్న మాట. నేను యిల్లరికం అల్లునితీరో, జీతంలేని డాక్టరు తీరో వాళ్ళ ఉచ్చులో బతకాలన్న మాట" అరవింద్ నోటిదాకా వచ్చి ఆగిపోయాడు.

"నాన్నా! ఏదైనా పి.జి చేసినంక పెళ్ళి చేసుకుంటే మంచిగుంటది. రా..." అంటూ అరవింద్ రాధ గురించి చెప్పబోయేంతలో అందుకున్నాడు తండ్రి.

"దానిదేముంది. పెళ్ళి ఖాయం చేసుకున్నంక అట్లనే సదువుకోనీ ఇద్దరికి సరిపడా నేనేపంపిస్త. ప్రాక్టీసు పెట్టేదాక అని అన్నడుర."

"ఈ బుద్ధి ఎంసెట్ కోచింగ్‌కు పోతానని అడిగినపుడెటు పోయిందే. రాధ అని ఓ అమ్మాయి ఉంది. ఇంతకంటే మంచి గుంటది. వాళ్ళ నాన్న పెద్ద ఆఫీసరు, నారాయణసేటుకన్న ఎక్కువే యిస్తడు, అమ్మాయి నాతోటే డాక్టరు కోర్సు చేస్తున్నది." అని ఇంకా పెద్ద సంబంధం అన్నట్టు ఎంతో ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు అరవింద్.

చంద్రయ్యకు సంతోషం కలిగింది. కాని తమ ఊళ్లో సంబంధం ద్వారా పెరిగే ప్రతిష్ట గొప్పది. అది దూరపు సంబంధంతో ఎలా వస్తుంది అని ఆలోచనలో పడ్డాడు. తల్లి సరిగ్గా అదేమాట అంది.

"ఎక్కడిదో దూరపు సంబంధం ఎట్లర! ఆఫీసర్ల పోకడ వేరు. వాల్లతోని మనం తూగం. నారాయణన్న, నిర్మల మనకు చిన్నప్పట్నుంచి తెల్సిన సంబంధమాయె" అంది దేవక్క

నిజమే. కాని చంద్రయ్య, దేవక్క అదే నేత వృత్తిలో ఉండి పేదగా మిగిలిపోవడం వల్ల ఆ సంబంధం సేటు-నేతగాడు సంబంధంగా మారుతూ వచ్చింది. అరవింద్ ఎలా చెప్పాలి... ఎలా సున్నితంగా ఈ సంబంధం తప్పించుకోవాలి అని ఆలోచిస్తున్నాడు. గట్టిగా చెప్తే నా బాకీ నాకు పారేసి మాట్లాడు అని అంటే ఇప్పుడెక్కన్నించి తెచ్చికడ్తాడు.

నారాయణ సేటు కాస్త చదువుకున్నవాడు, చిన్నప్పుడు తండ్రిలా ఇరవై నంబరు దొడ్డుచీరెలు నేసినవాడే. తర్వాత ముప్పయి నలభయి నంబరు చీరలు నేశాడు. తర్వాత అరవై నంబరు ధోతులు నేశాడు.

1949లో చేనేత సహకార సంఘం పెట్టినప్పుడు అతను కూడా తిరిగాడు. అతను హకీం నారాయణదాసు, గుంటుక నర్సయ్య పంతులు, కొండాలక్ష్మన్

బాపూజీ, గంగుల భూమయ్యలతో కల్సి తిరిగినవాడే. స్వాతంత్ర్య సమర యోధుడే.

"నాన్నా! నారాయణ మామ బాగా ఉన్నవాడు, నా మీద పెట్టుబడి పెట్టడం ఎందుకే. నాకు ఎవరైనా పెట్టుబడి పెడ్తారు. మన గురించి చిన్నప్పట్నుంచి తెల్సిన సంబంధం కదా. తమ్ముని కన్నా నిర్మల ఎనిమిది నెలలు చిన్నదే. తమ్మునికిచ్చి ఒక మంచి బట్టల దుకాణం పెట్టిచ్చి తమ్మున్ని తన తీరుగ పెద్ద సేటును చేయవచ్చు గదా."

"గట్ల ఆలోచిస్తే ఈ లోకం గిట్ల ఎందుకుండుర? అందరు మంచిగ బతుకకపోదురా? గంత ఓపికలు, మంచి గునాలు ఎవలనుకున్నయిరా? పండిందానికి ధర కద్దమని వస్తరు. మంచి సీరెలు నెయ్యిని అనే రైతులు మొత్తం పైసలు అడ్మాను యిస్తే యింతకన్న తక్కువ ధరకు ఇంతకన్న మంచిగనేసి ఇస్తుంటిమి. ఈ అప్పులు వడ్డీలు అన్నీ తగ్గు. గట్ల ముందుగాల పెట్టుబడి పెట్టు మంటే ఎవలకైనా బుగులే". తల్లి దేవక్క నిర్వేదంగా అంది.

తమ్ముని భవిష్యత్తు గురించి పెద్దకొడుకు ఆలోచిస్తున్న తీరుకు తల్లికడుపు నిండిపోయింది.

తల్లి ఫ్రెంచి శాస్త్రవేత్త చెప్పిన విషయాల్నే ఎంత అలవోకగా చెప్పేసిందని కొత్తగా ఆశ్చర్యపోయాడు అరవింద్.

"అట్లాగాక పోతే నేను రాధనే చేసుకుంట. ఇద్దరం కల్సి దవఖాన నడిపిస్తే తమ్ముడు మెడికల్ షాపు నడుపుకుంటడు. అట్లా తమ్ముడూ-మనం అందరం ఒక్కతీరు బతుకుతం గదనే."

"ఆఫీసరు బిడ్డ గట్ల సాగనిస్తాదిరా" అంది తల్లి.

"సరే ! నేను నారాయణ మామను కల్సి వస్త" అంటూ బయటకు నడిచాడు అరవింద్.

నారాయణ మామతో అరవింద్ తమ్ముడు ఆనంద్ గురించి చెప్పేసరికి విస్తుపోయాడు. అరవింద్ వాదన బాగానే ఉంది. కాని తనను చేసుకొమ్మని అడిగితే తమ్మునికిమ్మని చెప్పడం చాలా అవమానంగా ఫీలయ్యాడు. తరువాత అయినా మనస్సు మార్చుకుంటాడేమోనని ఆశగా మర్యాదగా అలాకాదని చెప్పాడు.

పోతూ పోతూ అరవింద్ మరో రెండుసార్లు బతిమిలాడితే తమ్ముడికి నిర్మలను ఇచ్చుటానికి ఒప్పుకొనేటట్టు ఉన్నడు అని తల్లి దండ్రులకు చెప్పి మరీ

అదే రాత్రి హైద్రాబాద్ బయలుదేరాడు.

నిర్మల తన చిన్న కోడలు అవుతుందనే ఆశ తల్లి దేవక్కకు కాలు నిలువ నీయలేదు. బాకీలన్ని దూది పింజలుగా తేలికైపోయినట్టు అనిపించింది. అయినా అడగడానికి వెనకాముందైంది. వారం రోజులకు ధైర్యం తెచ్చుకొని బయలు దేరింది.

వారం తర్వాత చెల్లెలు దేవక్కనోటి నుండి మళ్ళీ అదే ప్రతిపాదన విని నారాయణ సేటు దెబ్బతిన్న అహంతో మండిపడ్డాడు.

"మొన్నవాడు చెప్పింది సాలక మల్ల నువ్వచ్చినావే సంబంధం అంటూ! ఇంటర్ మీడియట్ ఫేలైనోనికి డిగ్రీ సదివే నా బిడ్డను అడుగుటానికి వానికి బుద్ధి లేకపోతే మీకు లేదా! నీ కొడుకు డాక్టరు కోర్సు సదువుతే కాదుగని ఎక్కడ ఆగుత లేరెమ్మే! చిన్న అంతరం-పెద్ద అంతరం చూడకుంట ఎట్లడగ బుద్ధయిందే? వియ్యానికైనా కయ్యానికైనా ఇద్దరూ సమానంగా ఉన్నప్పుడే రక్తి కడుతది. వాడేదో డాక్టరు కోర్సు సదువుతున్నడని పిలిసి పిల్లనిస్తనంటే మేం అంత లాచార్ (దిగజారినవాళ్ళం) అయినమా....." అంటూ దులిపేశాడు నారాయణ.

అనుకోని సంఘటనకు దేవక్క కనుగుడ్ల నీళ్ళను కొంగుతో ఒత్తుకుని అక్కన్నించి లేచింది.

❖ ❖ ❖

ఎనిమిది నెలలు గడిచాయి.

అరవింద్, దేవక్క మాటలకు అహం దెబ్బతిన్న నారాయణసేటు నిర్మలకు ఒక లెక్చరర్ సంబంధం ఖాయం చేసి భారీ కట్నంతో పెళ్ళి చేశాడు.

ఓ పెద్ద బరువు దిగిపోయినట్టు సంతోషపడ్డాడు అరవింద్.

"హలో అరవింద్, ఈ హైదరాబాద్ ఫిలిం ఫెస్టివల్ ఎంత అధ్వాన్నంగా అర్గనైజ్ చేశారో చూశావుగా! ఈ ఎలిజబెత్ సినిమా అద్భుతంగా ఉంది కదూ! పాస్ సంపాదించే సరికి తల ప్రాణం తోకకు వచ్చింది. నాన్న ఫోన్ చేసి యిప్పిస్తే గానీ దొరకలేదు. నువ్వెలా సంపాదించావు." ఉత్సాహంగా పలకరించింది రాధ.

అరవింద్ చెప్పాడు. విక్రాంత్ డీల్ చేసి యిప్పించిన తీరు విని ఆ చొరవకు ఆశ్చర్యపోయింది రాధ.

"ఎలిజబెత్‌కు ఎన్ని ఆస్కార్ అవార్డులొస్తాయో చూడాలి. ఇండియా వాడు తీశాడని నిర్లక్ష్యం చేస్తారేమో" అంది ఎంతో బాధగా రాధ.

ఎలా మొదలు పెట్టాలో తెలియక కాసేపు ఆలోచించి అన్నాడు అరవింద్.

"రాధా నీకో గుడ్ న్యూస్! మా అమ్మానాన్నలు మన పెళ్ళికి సరే అన్నారు. ఇక మనదే ఆలస్యం" అంటూ హమ్మయ్య చెప్పేశాను అని సంతోషంతో ఉబ్బిపోయి రాధ కేసి చూశాడు అరవింద్.

రాధ అకస్మాత్తుగా కలవరపడిపోయింది.

అంతలోనే తేరుకొని ఎటోచూస్తూ అంది.

"సారీ అరవింద్! నీకు చెప్పలేదు కదూ! నిరుడు స్టేట్స్ (అమెరికా) వెళ్ళిన వి.యల్.కాంట్ (వనమాల లక్ష్మీకాంతం) యం.యస్ కార్డియాలజిస్టుతో నాపెళ్ళి సెటిలైపోయింది. డాడి చూసాడీ సంబంధం. మార్చి అయిదో తేదీన పెళ్ళి. నువ్వు తప్పకుండా రావాలి."

ఓడిపోయి సింహాసనం దిగిపోయిన చక్రవర్తిలా అరవింద్ మొహం నల్లబడిపోయింది. అమ్మానాన్నా, నిర్మల, నారాయణమామ, తమ్ముడు గిర్రున జ్ఞాపకాల్లో తిరిగి ఎందుకో కన్నీళ్ళొచ్చాయి.

"మంచిది రాధా! గుడ్‌బై. విష్‌యూ బెస్టాఫ్‌లక్." అంటూ అక్కన్నించి చరచరా ముందుకు నడిచాడు అరవింద్.

మూడ్ అంతా చెడిపోయింది. హాస్టల్‌కు వెళ్ళి మెస్‌లో తిని పడుకున్నాడు అరవింద్. తన కలలు కుప్పకూలిపోయాయి. ఏడ్చి ఏడ్చి అలసిపోయాడు.

జ్వరం వచ్చిన వాడిలా గాఢ నిద్రపోతున్న అరవింద్ విక్రాంత్ కుదుపుతో లేచాడు. రాత్రి పదకొండైనా కాలేదు. ఎంత గాఢ నిద్ర....అంటూ ఇంకా ఏదో అనబోయి కన్నీటి చారికలు చూసి ఆగిపోయాడు విక్రాంత్.

"ఏంటి సంగతి! పైసలు పంపం అని ఇంట్లో ఏమైనా లొల్లి అయిందా? ముందు మొఖం కడుక్కొని రాపో! నాకు పార్ట్ టైం జాబ్ వచ్చింది. అమ్మా చెల్లెలి మీద నా భారం తగ్గింది. చెల్లె పెళ్ళి కోసం కాస్త కట్నం కూడా ఇక కూడబెట్టవచ్చు. ఈ సంతోషం నీతో పంచుకుందామని నీ కోసం ఫిలిం ఫెస్టివల్ అంతా తిరిగిన. విసిగి వేసారి నీకోసం ఇక్కడికి వస్తే నువ్వు యిలా...." అంటూ డీలా పడిపోయాడు విక్రాంత్.

అరవింద్ ఫ్రెష్ అయివచ్చాడు. అయినా మూడీగానే ఉన్నాడు.

విక్రాంత్ అడగ్గా అడగ్గా రాధ విషయం వివరించాడు అరవింద్.

"రాధ యిలా చేస్తుందని ఏ కాస్త అనుమానం ఉన్నా నారాయణ మామ కూతురు నిర్మలనైనా చేసుకొనేవాడిని. నాకు ఎంతో ఆధారం ఉండేది." అన్నాడు అరవింద్ చివరికి.

"అరె బావా! బాధపడకు. రాధకూడా నీలాగే ఆలోచించింది, ఎవరైనా ఉన్న స్థితినించి మరింత ఉన్నత జీవితం గెలుచుకోవాలనుకుంటారు. సమాజంలోని దాని పర్యవసనాలే నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అని మన దేశ దుస్థితికి ఈ దృష్టే ఎలా కారణమో ఫ్రెంచి శాస్త్రవేత్త ఎంత బాగా చెప్పాడు. రాధకు నీ సోషల్ బ్యాగ్రౌండ్ ఎపుడైతే తెల్సిపోయిందో అప్పుడే కట్ చేయకుండా ఇంకా నీతో స్నేహం కొనసాగించడం ఆమె సహృదయతకు నిదర్శనం రా!" అంటూ చాలా సేపు ఓదార్చాడు విక్రాంత్.

మరోసారి సముదాయించాడు విక్రాంత్.

"అరే అరవింద్! రాధ నీ ప్రేమను నిరాకరించిందని భగ్నప్రేమికుడిగా బెంగటిలిపోతే నీమీదే ఆశలు పెట్టుకున్న నీ కుటుంబం ఏం కావాలి! నువ్వు డాక్టర్‌వై రేపు యం.ఎస్. జనరల్ సర్జన్ చేస్తే మీ తమ్ముడు మెడికల్ షాపు నడిపించుకుంటా ననుకున్నది మరిచిపోయావా? ఇట్లా బాధపడుతూ కూర్చుంటే యింటర్ ఫేలయిన చిన్న బావ ఆనంద్ ఇలాగే బట్టల దుకాణం గుమాస్తాగానే మిగిలిపోతాడు. నువ్వు, పారూ, జూలీ, రాధా, అనార్కలీ అంటూ ఏడుస్తూ కూర్చుంటే నీకు ఎవరో పెట్టుబడి పెట్టేసి మీ తమ్మున్ని కాదని మెడికల్ షాపు, ల్యాబ్, ఎక్సరే యూనిట్ అన్నీ వాళ్ళే నడుపుకుంటారు. అపుడు నారాయణ సేటు బిడ్డ నిర్మలను చేసికొని యిల్లరికం అల్లుడుగా మారినట్టుంటుంది నీ స్థితి.

"అరవింద్! బీ బ్రేవ్! అసలు ప్రేమ గురించి, పెళ్ళి గురించి నీకున్న సెంటిమెంట్సు, దృక్పథం మారాలి. ఫెమినిజం వచ్చాక ప్రేమ, పెళ్ళి, కుటుంబం, వాటి నిర్వచనాలు మారిపోయాయి. రేపు 'మానవి' సంస్థ వాళ్ళు చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో 'పెళ్ళి – దృక్పథాలు' పై సెమినార్ పెట్టారు. ఫిలిం యిండస్ట్రీలోని ఫెమినిస్టులతో పాటు, ఇంటర్నేషనల్ ఫెమినిస్టులు, ఫెమినిస్టు రైటర్స్ వస్తున్నారు. మగవాళ్ళు కూడా వెళ్ళవచ్చు. తప్పకుండా రావాలి. రేపు అక్కడే కలుసుకుందాం.

"సరే! నేను పోతున్నాను. ఈ రాత్రి ఓ.యు. క్యాంపస్‌కు బస్సు దొరుకుతుందో లేదో! ఆటో ఎక్కితే ముప్పయి రూపాయలు అడుగుతారు. మా అమ్మ, చెల్లె ఎంతో కష్టపడి, తినీ, తినక, రోజంతా బీడీలు చేసి నేను చదువు

కోవాలని పంపిస్తున్న పైసలివి. బస్సు దొరక్కపోతే నడిచేపోతా! ఒరే అరవింద్! కన్నీళ్ళు తుడుచుకోరా! నా చెల్లెలు కూడా నిన్ను ప్రేమించినందుకు నీలా ఏడుస్తూ కూర్చుంటే కష్టపడి పైసలు పంపునా? అపుడు నా గతి నీ తమ్ముడి గతి అయ్యేది. నేనిలా చదువుకోగలిగేవాడినా? సావిత్రిలా జీవితాన్ని నిబ్బరంగా అర్ధం చేసుకో. వాస్తవ జీవితాన్ని గ్రహించు."

అంటూ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు విక్రాంత్. తన చెల్లెలు భగ్నప్రేమ గురించి విక్రాంత్ మాట్లాడిన మాటల అంతరార్ధం మెడిసిన్ చదువుతున్న అరవింద్ అబ్సర్డ్ మూడ్‌కు అర్ధం కాలేదు.

రాధ అతన్ని నిరాకరించి మరొకర్ని పెళ్లి చేసుకోబోతున్న విషయమే అతనికి ప్రపంచం మునిగిపోయే సమస్యగా కనపడుతోంది. తాను నిరాకరించడం వల్ల సావిత్రి కూడా కలలు చెదిరి యిలాగే బాధపడిందని అరవింద్ ఇప్పటికీ గ్రహించలేకపోయాడు.

❖ ❖ ❖

అరవింద్ చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ హాలు చేరేసరికి హాలు బయట కూడా జనం కిటకిటలాడుతున్నారు. ఇదంతా ఫెమినిజంపట్ల ఆకర్షణో, ఆడవాళ్ళపట్ల ఉండే ఆకర్షణో, ఫిలిం సంబంధీకుల పట్ల ఆకర్షణో అర్ధం కాక ఆశ్చర్యపోయాడు అరవింద్.

ఎంతసేపట్నుంచో తేపకోసారి అతనికోసం చూస్తూ

"సీటు ఆపి ఉంచిన దా!" అంటూ వచ్చి పలకరించాడు విక్రాంత్.

"లేటయితే గొప్ప ఉపన్యాసం మిసర్సయ్యేవాడివి. జాగ్రత్తగా విను. మీ మెడికోల మెదళ్ళు సోషల్ సైన్సెస్ విషయంలో ఉత్త మట్టి బుర్రలు. మీకు మీ సబ్జక్టు తప్ప లోకం తెలియదు. ప్రేమా దోమా అని బుర్ర బద్దలు కొట్టుకోకు" అంటూ లాక్కుపోయాడు విక్రాంత్.

మట్టి బుర్ర అన్నందుకు ఏదో అనబోయాడు అరవింద్. కాని ప్రసంగం నడుస్తోంది.

"ప్రేమ, పెళ్ళి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, సంస్కృతి, ఇవన్నీ రాజకీయాలే. ప్రతి వ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే, సామాజికమైనదే. వీటితో పాటు ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్ సెంటర్స్ అన్నీ సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనమిక్స్

తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్ళి, కుటుంబం మొ॥ రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చెలాయించడం పితృస్వామిక సమాజ విలువల వల్ల సాధ్యపడుతున్నది.'' అమెరికన్ ఫెమినిస్టు ఎవరో చెప్పుకుపోతున్నారు. చప్పట్లు మారుమోగాయి.

"నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడిదారీ దోపిడి వర్గాల, పురుషాధిపత్యవాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్య కాదు. తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు కాస్త పెద్ద హోదాతో పెళ్ళి చేస్తారు. అటువైపునుండి హోదాను, ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు."

అరవింద్‌కు ఒక్కొక్క మాట బాణంలా గుచ్చుతోంది. రాధపట్ల తనది రెండు హోదాల మధ్య ప్రేమేనా? మరదలు సావిత్రి ప్రేమను తాను అందుకే అంత తేలిగ్గా తీసేశాడా? రాధ కూడా యిందుకే తన ప్రేమని అంత తేలిగ్గా తీసేసిందా? మరదలు సావిత్రి గురించి విక్రాంత్ రాత్రి ఏదేదో చెప్పాడు. తనను ఇందుకేనా విక్రాంత్ యీ మీటింగుకు మరీ మరీ రమ్మని చెప్పింది. నారాయణ సేటు నిర్మలకు కట్నంతో హోదాను కొన్నట్టేనా? విక్రాంత్ రాత్రి అన్న మాటల అర్థం అరవింద్‌కు మెరుపులా మెరిసింది.

తన మేనమరదలు సావిత్రి పదవ తరగతి పాసై ఆగిపోయింది. బీడీలు చేస్తోంది. అరవింద్ బావ టీచర్ ట్రేనింగ్ చేస్తే బావతోనే పెళ్ళవుతుందని ఆశించింది. కాని మెడికల్ సీటు రావడంతో ఆశ వదులుకుంది. అది ఎంతో సహజం అన్నట్టే సావిత్రి మామూలు మనిషై పోయింది. ఆమెను ప్రేమించిన తన ప్రేమను కూడా చాలా తేలికగా తీసుకుని మరిచిపోయాడు అరవింద్.

"మనిషి యిష్టాయిష్టాలను మనిషి కాకుండా వ్యవస్థలు, హోదాలు, స్థలకాలాలు, భావాలు, అర్హతలు నిర్ణయిస్తుంటాయి" ఆమె చెప్పుకుపోతూనే ఉంది.

ఆమె ప్రధాన ప్రసంగం అయిపోయాక ఫ్రెండ్స్‌ని విష్ చేద్దామని విక్రాంత్‌ని లేవదీసి వరండాలోకి నడిచాడు అరవింద్.

లత "హాయ్" అంటూ అరవింద్‌కేసి చూస్తూ అందంగా విష్ చేసింది. స్త్రీ గొంతు. తననేమో అనుకుని ఉలిక్కిపడి చూశాడు విక్రాంత్.

ప్యాంట్, షర్టు వేసుకుని మగవాడిలా ఉన్న ఆమెను పోల్చుకో లేకపోయాడు.

అరవింద్, లత ఏదో మాట్లాడుకుంటూ నవ్వుకున్నారు. మైకు శబ్దంలో విక్రాంత్‌కు విన్పించడం లేదు. కాసేపటికి అరవింద్ చెయ్యి పట్టుకొని కాస్త పక్కకు తీసుకెళ్ళి గుసగుసగా అన్నాడు విక్రాంత్.

"ఫెమినిస్టుల సెమినార్‌కు రమ్మన్నానని పొరపాటున ఫెమినిష్టును పెళ్ళి చేసుకునేవు. చేసుకొంటే నీ కుటుంబం మొత్తం ఆగం అవుతుంది జాగ్రత్త. ఫెమినిస్టులు తనకు తాను వ్యక్తిగతంగా మరింత ఎదగాలని కోరుకుంటారే తప్ప ఆమెకన్నా వెనకబడిపోయిన మీ తమ్ముళ్ళీ, తల్లిదండ్రుల్నీ ఎదిగిస్తూ పోషిస్తూ కూర్చోరు. అదంతా వాళ్ళ దృష్టిలో వేస్టు లగేజీ. మనలాగ నూటికొక్కడు పైకొచ్చే కుటుంబాల్లో ఫెమినిస్టులను పెళ్ళి చేసుకొంటే మన అభివృద్ధి నీవాళ్ళకందకుండా పోతుంది. అసలు ఉమ్మడికుటుంబం విచ్ఛిన్నమై, వ్యక్తికుటుంబం ఏర్పడితే తప్ప ఫెమినిజం పుట్టడం సాధ్యం కాదు." అన్నాడు విక్రాంత్ ఎక్కడ లత బుట్టలో పడిపోతాడేమో అని ఆలోచిస్తూ.

అరవింద్‌కు కాస్త కోపం వచ్చింది.

"ఫెమినిస్టులు నిజమైన ప్రేమ - అసలైన హృదయం గురించి మాట్లాడుతుంటే వాళ్ళను మరీ యింత స్వార్థపరులనడం బాగాలేదు. రాజకీయాలు, సామాజిక అర్థశాస్త్రం చదివి చదివి నీ బుర్ర ప్రతి వ్యక్తిలో స్వార్థాన్నే చూస్తున్నది. ఆమె ఎవరనుకున్నావు? లత. నా క్లాసుమేటు. నన్ను బాగా ప్రేమిస్తోందని చెప్పానే ఆమే యీ లత. హృదయం లేనిది ఆమెకు కాదు నీకే." తనది మట్టిబుర్ర అన్నందుకు సరిగ్గానే అన్నానని సంతోషపడ్డాడు అరవింద్.

విక్రాంత్ అహం దెబ్బతిన్నది. తనకు హృదయం లేదని ఎవరైనా అని ఉంటే బాధపడి ఉండేవాడు కాదు. అన్నీ తెల్సిన చిన్ననాటి క్లాసుమేటు అరవింద్ ఆ మాట అన్నాడు. బాధ నుంచి కోపంగా అన్నాడు విక్రాంత్.

"అరేయి అరవింద్! ముందసలు నీకు హృదయం ఉందా చెప్పు! ఉంటే చిన్నప్పట్నుంచి నువ్వు ప్రేమించిన నా చెల్లెలు సావిత్రిని పెళ్ళి చేసుకొని నిరూపించురా! నీ స్వార్థానికి చాలదు కాబట్టి సావిత్రిని వదిలి రాధను ప్రేమించావు" అంటూ కన్నీళ్ళతో గబగబా వెళ్ళిపోయాడు విక్రాంత్.

ఆ మాటల ఈటెల్నుంచి తేరుకునేసరికి విక్రాంత్ మెట్లు దిగాడు. గబగబా

వెళ్ళిన అరవింద్ ప్రయత్నం వ్యర్థమే అయింది.

చేయి విదిలించుకొని తీక్షణంగా చూసి వెళ్ళిపోయాడు విక్రాంత్. అరవింద్ వెనకే లత పరుగులా వచ్చింది.

"అసలేం జరిగింది" అంటూ ఆరా తీసింది లత.

టూకీగా విషయం చెప్పాడు అరవింద్. అది విన్నాక లత కూడా అరవింద్‌పై విరుచుకుపడింది."

నా గురించి విక్రాంత్‌కు ఇంతకాలం దాకా అసలు విషయాలు ఎందుకు చెప్పలేదు. నేను మాదిగ ఎస్సీనని, మా అమ్మ వరంగల్‌లో మున్సిపల్ స్వీపరని, మా అన్న పరకాలలో స్కూలు అటెండరని చెప్పడం నీకు చిన్నతనం అన్పించిందా! అవి నీకు చిన్నతనంగా కన్పించాయంటే మీలో ఎంతో కులతత్వం ఉందని అర్థం.

"సమాజానికి ఉపయోగపడే ఏ పని అయినా గౌరవనీయమేనదే. మా అమ్మకు, అన్నయ్యకు ఆ ఉద్యోగాలే లేకపోయి వుంటే నేనెలా ఈ చదువు చదువుకోగలిగేదాన్ని? నీకన్నా విక్రాంతే నిర్మలమైన మనస్కుడు. ఎంతో హృదయ సంస్కారం ఉంటే తప్ప తన చెల్లెలి ప్రేమను నిరాకరించినవాడితో యింకా ఎలా స్నేహం చేస్తాడు? పైగా వేరే ప్రేమికురాలితో జరిగిన పరాభవం నుండి ఓదార్చాడంటే ఎంత మంచివాడై ఉండాలి...

"ఈసారి నేనే అతనికి అన్ని విషయాలూ వివరిస్తాను. విక్రాంత్ అన్నదాంట్లో తప్పేముంది? నిన్ను ప్రేమించినందుకు నన్ను కూడా ఎంత లోకువగా చూశావు. నిన్ను ప్రేమించి భగ్నప్రేమికురాలిగా ఏడ్వడం ఎంత బుద్ధితక్కువో యిపుడే తెలిసింది. గుడ్‌బై" అంటూ చకచకా మెట్లెక్కి తిరిగి మీటింగ్‌లో కల్సిపోయింది లత.

విక్రాంత్‌తో చెంపదెబ్బ, లతతో గోడదెబ్బ తగిలి అచేతనుడయ్యాడు అరవింద్. కాళ్ళీడ్చుకుంటూ మీటింగ్ కేసి నడిచాడు.

❖ ❖ ❖

లత విక్రాంత్‌లు ఎడాపెడా వాయించిన మాటలు అరవింద్‌ను నిద్ర పోనీయడం లేదు. రాధ కోసం తాను బాధపడ్తున్నట్టే తనకోసం లత బాధపడింది. తమ యిద్దరి బాధకన్నా సావిత్రి దుఃఖం ఎంతో హెచ్చు. తనకోసం సావిత్రి ఎంత బాధపడిందో.

అమ్మానాన్నలు పెద్దసేటు అయిన నారాయణ మామ కూతురు నిర్మలను పెళ్ళి చేసుకొమ్మని అడిగారే గానీ మేనమరదలు వరుసైన సావిత్రి ఊసే ఎందుకు

తీయలేదు. అత్త బీడీలు చేస్తుందనే గదా!

కట్నం ఏమీ యివ్వలేరనేదొక్కటి తప్ప సావిత్రిని కాదనడానికి కారణాలేముంటాయి?

తనకు డాక్టరమ్మాయే కావాలంటే దొరక్కపోదు. లత ఉంది. కాని సావిత్రికి డాక్టరు భర్త దొరుకుతాడా-తాను కాదంటే. అమెరికన్ ఫెమినిస్టు అన్నట్టు బాకీ సంబంధాల్లాగే మేన సంబంధాలు కూడా సోషల్ క్యాపిటల్ తాలూకు హక్కులు అధికారాలే. విక్రాంత్, సావిత్రి యింతకాలంగా హృదయాల్లో ఎంత బాధ దాచుకున్నారో. అలాంటి విక్రాంత్‌ను నీకు హృదయం లేదని తిట్టాడు తాను.

ఆలోచిస్తున్నకొద్దీ అరవింద్‌లో ఏదో బాధ పెరిగిపోతూ ఉంది. చదువు మీదికి దృష్టి పోవడం లేదు. లతను పలకరిస్తే ముక్తసరిగా మాట్లాడి తప్పించుకుంది.

తనకోసం పడిచస్తుందనుకున్న లత ఈసడింపు మరింత బాధ పెట్టింది.

"సారీ అరవింద్, ఆ రోజు నుండి ప్రేమ, పెళ్ళి పట్ల నా దృష్టే మారిపోయింది" అంటూ వెళ్ళిపోయింది.

అరవింద్‌కు ఎందుకో ఇంటికి పోవాలని, సావిత్రిని పలకరించాల నిపిస్తోంది.

రాత్రి తొమ్మిదింటికి అకస్మాత్తుగా దిగిన కొడుకు అరవింద్‌ను చూసి దేవక్క చంద్రయ్య ఆశ్చర్యపోయారు.

మళ్ళీ పైసలు కావాలంటాడేమోనని తల్లిదండ్రుల మనస్సు బిక్కుబిక్కు మంది. తన కూతురు నిర్మల పెళ్ళిసంబంధంను కాదన్న నుంచి బాకీ అడిగినప్పుడల్లా నారాయణ పైసలు లేవనే అంటున్నాడు. నిర్మల పెళ్ళికి తానే అప్పు చేయాల్సి వచ్చిందని గొణుగుతున్నాడు.

తమ్ముడు ఆనంద్ బట్టల షాపు నుండి అపుడే వచ్చాడు. ఆనంద్‌తో అదీ యిదీ మాట్లాడి తిని తొందరగానే పడుకున్నాడు అరవింద్.

ఉదయం స్నానం అవడంతోనే తయారై సావిత్రి యింటికేసి నడిచాడు అరవింద్.

సావిత్రి తల్లి సక్కుబాయి ఇంటెనుక గిన్నెలు కడుగుతోంది. సావిత్రి బీడీల ఆకు కత్తిరిస్తోంది.

అరవింద్‌ను చూసి సావిత్రి తొట్రుపడి సిగ్గుపడిపోయింది.

అరవింద్ ముఖంలో కాస్త చిరునవ్వు విరిసింది.

సావిత్రి చేతిలోని కత్తెర, బీడీల ఆకు బుట్టిగుల్ల (గంప) లో పడేసి "అమ్మా! అరవింద్ బావచ్చిండే" అంటూ యింటి వెనక్కు పరిగెత్తింది.

సావిత్రి కాళ్లకున్న వెండి పట్టగొలుసుల గజ్జెలు గలగలమంటూ అరవింద్ హృదయంలో సవ్వడి చేశాయి.

"కూసొమ్మను. చాయె పెట్టు పో. గిన్నెలు ఈన్ని కడిగి వస్త" అంది సక్కుబాయి.

అరవింద్‌తో కొడుకు విక్రాంత్ ఏం చెప్పి పంపాడో అనుకుంది సక్కుబాయి.

"సావిత్రీ! నువ్వు ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షకు కట్టకపోయినవ్" అంటూ అడిగాడు అరవింద్ కుశల ప్రశ్నలయ్యాక.

సక్కుబాయి ఆ సలహా యిదివరకెన్నోసార్లు విన్నది. ఎన్నోసార్లు చెప్పిన జవాబే మళ్ళీ చెప్పింది.

"నీకేందోయి అల్లుడా! మొగోల్లు ఎంత సదువుకుంటె అంత మంచి ఉద్యోగం దొరుకుతది. ఆడపిల్ల ఎక్కువ సదువుకుంటె అంతకన్న ఎక్కో సదివిన సంబంధం తేవాలంటే నాతోని అయితదా?"

"ఎందుకు కాదత్త! విక్రాంత్ ఉద్యోగం చేస్తనే ఉండె. అన్నట్టు విక్రాంత్ పైసలు పంపిండు" అంటూ అయిదు వందలు యిచ్చాడు అరవింద్.

టీ యిచ్చి మళ్ళీ బీడీల ఆకు ముందేసుకుంది సావిత్రి.

సావిత్రి ఎంత అందంగా ఉంది అనుకున్నాడు అరవింద్.

రాధ, నిర్మల, లతకన్నా సావిత్రే ఎంతో బావుంది.

తనకు చిన్నప్పట్నుంచీ తెల్సిన పిల్ల.

కొద్ది క్షణాలు గుండె వేగంగా కొట్టుకుంది.

తాను రాధను ప్రేమించి పొరపాటు చేశాడా!

అక్కడినుంచి సెలవు తీసుకొని యింటికొచ్చాడు అరవింద్. అప్పటికి తమ్ముడు ఆనంద్ బట్టలషాపుకు వెళ్ళిపోయాడు. నాన్న మగ్గం నేస్తున్నాడు. అమ్మ నూలు కండెలు చుడుతోంది. రాట్నం తుమ్మెద రాగంలా తిరుగుతోంది.

"అమ్మా! సావిత్రికి ఏమైనా పెండ్లి సంబంధాలు వస్తున్నయా? సావిత్రి తోటిదైన నిర్మలకు పెళ్ళయిపాయె. ఇపుడు విక్రాంత్ ఉద్యోగం కూడా చెయ్యవట్టె." తల్లి దేవక్కను అడిగాడు అరవింద్.

సావిత్రి విషయం ప్రస్తావించిన కొడుక్కేసి ఎగాదిగా చూసింది దేవక్క.

"కాంతడు చెల్లెకు ఏమైనా సంబంధం చూసిండా ఏందిరా? అందుకే వచ్చినవా ఏంది?"

"అందుకోసమైతే విక్రాంతే రాడా? పైసలు పంపుతె యిచ్చి వచ్చిన. ఎవలన్న అడుగుటానికి వస్తున్నరా?"

"మొన్న రెండు సంబంధాలు వచ్చినై. అల్ల కుటుంబం ఎసొంటిది అని నన్నే అడిగిన్రు. అల్లు యింతట్ల పెళ్ళి చెయ్యరు అని చెప్పిన" అంటూ అర్థోక్తిగా నవ్వింది దేవక్క.

"అట్లా ఎందుకు చెప్పినవే. విక్రాంత్ సావిత్రి పెళ్ళి చేసే ఆలోచనల ఉన్నడు."

"మన ఆనంద్‌కు సావిత్రిని చేసుకుంటే ఎట్లుంటదిర? మొన్న వాళ్లు అడుగవచ్చినపుడే నాయిన్న నేను అనుకున్నం. అది రోజుకు వెయ్యి బీడీలు చేస్తది. మనమంటే దానికి చిన్నప్పట్నుంచీ ఎంతో భయం, భక్తి. నీక్కాడ కుదిరితే యిద్దరికీ ఒకసారే పెండ్లి చేస్తే ఓ పని తీరుతది. వానికి గూడ ఏండ్లు పడవట్టె. దాన్ని నీకు చేద్దామని మునుపు అనుకున్నంగని నీ బాకీ తీరుదెట్ల అన్నడు మీ నాయిన్న."

నాన్న నేస్తున్న మగ్గంలో టక్కుం టిక్కుం అంటున్న నాడె దారితప్పి తన గుండెల్లో దిగబడ్డట్టు అరవింద్ హృదయం కలుక్కుమంది.

"సావిత్రికి తెలుసానే మీరనుకున్నది?"

కండెలు చుడుతున్న రాట్నం జంకారంలాగే నవ్వి అంది దేవక్క "తెలువకుంట ఎట్లుంటదిర?"

"ఇల్లంత పులిసిన గంజి వాసన వేస్తున్నదే" అంటూ మాట మార్చాడు అరవింద్.

"ఇయ్యాల కొత్తగా అడుగవడితివేంర? మబ్బుల వడ్డది గద. సరి చేసిన నూలు గంజి వాసనత్తంది" అంది దేవక్క.

చంద్రయ్య మగ్గం నేయడం ఆపి మగ్గం గుంట నుండి లేచాడు.

"పెద్దోడు వచ్చిండు గద. ఆకలైతంది. ఇద్దరికి అన్నం బెట్టు" అన్నాడు చంద్రయ్య.

రాట్నం ఆపి దేవక్క అన్నం వడ్డించింది.

రెండు రోజులున్నాడు అరవింద్.

తనలాంటి వాళ్ళకు అటు పూర్తి పై స్థాయి రాధతోనూ పెళ్ళి వీలు కాలేదు. ఇటు పూర్తిగా కింది స్థాయి సావిత్రితోనూ పెళ్ళి కాలేని స్థితి. ఎందుకిలా జరుగుతోంది. పెళ్ళికి మనిషి యిష్టాయిష్టాల ప్రమేయం లేదా!

రెండు రోజులయ్యాక తనలో తాను సమాధానపడ్డాడు అరవింద్.

అమ్మానాన్నా అన్నదాంట్లో తప్పేమీ లేదు అని అర్థం అయ్యాక అతని మనస్సు తేలికపడింది.

తనను ఎంతగానో ప్రేమించే లత ఉండగా విక్రాంత్ మాటలను పట్టుకొని తాను ఫీలవడం, ఆలోచించడం ఉత్త సెంటిమెంటల్ అనుకున్నాడు అరవింద్.

❖ ❖ ❖

హైద్రాబాద్ నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ ఎకరాలకొద్దీ పచ్చని చెట్లు. అంత పెద్ద నగరంలో నడిబొడ్డున అంత పెద్ద పార్కు ఎలా సాధ్యమయిందో అని ఆశ్చర్యపోయేంత పెద్ద పార్కు. అక్కడే అసెంబ్లీ హాలు. అందులోనే పురావస్తు శాఖ. లలిత కళాతోరణం ఓపెన్ ఆడిటోరియం. అటునుంచి పడపటికి వెళ్తే నాంపల్లి రైల్వేస్టేషన్ అంతా చూసేవిధంగా ఫుట్‌పాత్ ఫ్లైఓవర్. జూబ్లీహాల్, ప్రియదర్శిని హాల్ అన్నీ తిరిగి మూడ్ బాగాలేక అరవింద్ ఒక చెట్టు కింద కూలబడ్డాడు.

అల్లంత దూరాన మరో చెట్టు కింద లతను చూసి ఆశ్చర్యపోయాడు అరవింద్. లత కూడా అతన్ని అక్కడ చూసి ఆశ్చర్యపోయింది.

లతకూడా మూడ్ బాగాలేక అక్కడికి చేరిందని అరవింద్‌కు తెలియదు.

తనను వెతుక్కుంటూ వచ్చాడా అని క్షణకాలం పులకరించింది లత. ఆమె కళ్ళు సంతోషంతో మెరిసాయి. అంతలోనే దిగాలు పడిపోయింది.

"హాయ్ లతా! ఏంటి ఈ మధ్య మూడీగా ఉంటున్నావు? ఏమైంది?"

"హాయ్!" అంటూ విషాదంగా నవ్వింది లత.

అరవింద్ మళ్ళీ మళ్ళీ అడిగేసరికి లత టాపిక్ మార్చింది.

"ఏం లేదు అరవింద్! మనం ప్రేమించే వారికన్నా మనను ప్రేమించే వారితో పెళ్ళి జరిగితే జీవితం ఆనందమయమవుతుందంటారు. నీ అభిప్రాయం ఏమిటి?"

"అది నిజం లతా! అందుకే మన పెళ్ళి యిద్దరికీ ఆనందమయమైన జీవితాన్నే యిస్తుంది" అంటూ నవ్వాడు అరవింద్.

అరవింద్ పెళ్ళి ప్రస్తావనతో లత విస్తుపోయింది. తనను చూస్తే అరవింద్‌కు వేళాకోలంగా వుందా! అని అతనికేసి ఎగాదిగా చూసింది లత. ఆమెది ముందే గాయపడ్డ హృదయం.

అరవింద్ చూపుల్లో పశ్చాత్తాపంతో కూడిన ప్రేమ. లత కళ్ళల్లో మళ్ళీ క్షణకాలం వెలుగు. మళ్ళీ అంతలోనే విషాదం.

"నువ్వు అకస్మాత్తుగా యింటికెళ్ళావేంటి! మళ్ళీ ఏదైనా పెళ్ళి సంబంధం వచ్చిందా?" నవ్వింది లత.

"అసలు విషయం దాటవేస్తున్నావు. నేనడుగుతున్నది మన పెళ్ళి గురించి."

"నిన్ను ప్రేమించే నన్ను చేసుకుంటే నీ జీవితం ఆనందమయమవుతుంది. కాని నన్ను ప్రేమించే వారితో నా పెళ్ళి జరిగితే నాకు ఆనందంగా ఉంటుంది గదా!" ఉడికించింది లత.

అరవింద్ సీరియస్ అయిపోయాడు.

వెళ్తానంటూ వెళ్ళబోయాడు. చేయి పట్టి ఆపి అంది లత.

"అరవింద్! మా అమ్మా అన్నయ్యల సంగతి తెలిస్తే నన్ను చేసుకుంటా అని అనలేవు. విక్రాంత్ మొన్న మా వూరికొచ్చాడు. మా పరిస్థితి అంతా చూశాడు. విక్రాంత్ రాకపోతే మా అన్నయ్య యిపుడు జైల్లో ఉండేవాడు. వదిన ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. ఇపుడు కొంత కోలుకుంది."

"అరరే....ఎందుకు జరిగింది? విక్రాంత్ ఎపుడొచ్చాడు. ఏం జరిగిందసలు."

"అదంతా పోనీలే అరవింద్! పార్కులోనైనా ప్రశాంతంగా ఉండనివ్వు. మీ ఊరికి ఒకసారైనా రమ్మనవేం? ఎస్సీననా?"

"ఛ! అలా అంటావేం? వచ్చే ఆదివారం వెళ్దామా?"

"ఈసారి వీలు కాదు. తర్వాత చూద్దాం. ఊరికే అడిగాను" అంది లత.

❖ ❖ ❖

సెలవుల్లో విహార యాత్ర పేరిట లతను తీసుకొని విక్రాంత్, అరవింద్ జగిత్యాల బయలుదేరారు. సావిత్రి తోడుగా ఉంటుందని సక్కుబాయి ఇంట్లోనే ఉండిపోయింది లత.

మొదటి రోజులోనే లత సావిత్రితో, విక్రాంత్ తల్లి సక్కుబాయితో యింట్లో సొంత మనిషిలా కల్సిపోయింది.

"మేం మాదిగోల్లం అంటీ" అని లత అంటే సక్కుబాయి, అరవింద్ తల్లి దేవక్క నమ్మలేకపోయారు.

లత అచ్చం మన పద్మశాలీల పిల్ల తీరే ఉన్నది అని మెచ్చుకున్నారు.

రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో గల ప్రభుత్వ చల్‌గల్ అగ్రికల్చరల్ ఫారం, పొలాస అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్, రెండువందల ఏళ్ళనాటి జగిత్యాల ఖిలా చూద్దామని బయల్దేరదీశాడు విక్రాంత్.

సావిత్రి, సక్కుబాయి, దేవక్క లత, అరవింద్, విక్రాంత్ కల్సి బయల్దేరారు. ఖిలా గురించి విక్రాంత్ చెప్తుంటే సావిత్రి, లత ఆసక్తిగా విన్నారు.

సావిత్రితో కలిసి మరుసటిరోజు ముప్పై కిలోమీటర్ల దూరంలోని ధర్మపురికి గోదావరి స్నానానికని బయల్దేరారు. సక్కుబాయి, దేవక్క యింటి వద్దే ఆగిపోయారు.

గోదావరి నది ఎంత అందంగా ఉందో! గోదావరినది మెత్తని యిసుకలో నడుస్తున్నపుడు అరవింద్‌తో మెల్లిగా అంది లత.

"అరవింద్! విక్రాంత్ వాళ్ళ అమ్మనూ, సావిత్రినీ చూస్తుంటే అది మా యిల్లులాగే ఉంది. నా సోషల్ బ్యాగ్రౌండుకూ, నా అభిరుచులకూ విక్రాంతే మంచి మ్యాచ్ అన్పిస్తోంది" సాభిప్రాయంగా చూసింది.

అరవింద్ అవాక్కయ్యాడు. తాను ఆలస్యం చేశాడా? అని మదనపడిపోయాడు.

"విక్రాంత్‌కు తెల్సా నీ ప్రేమ?" అడిగాడు అరవింద్.

లత నవ్వుతూ అంది.

"అతనెలా ఊహిస్తాడు? నేను నిన్ను ప్రేమిస్తున్నట్టు అతనికి తెల్సు. అంతే."

"నా మీద అలిగి మనస్సు మార్చుకున్నావా లతా!" అన్నాడు అరవింద్ ఉండబట్టలేక.

అరవింద్ లోలోపల ఏదో తెలియని బాధ చీకటిలా పరుచుకుంటోంది.

"అరవింద్! అలా బాధపడకు. ఉన్నతంగా ఆశించడం ఎవరికైనా సహజమే. అనుభవించగలిగిన స్తోమత, విశ్వాసం ఉన్నపుడే ఆశించింది అందినపుడు సుఖపడడం సాధ్యం."

"ఏంటి లతా! ఇవాళేదో తత్వశాస్త్రం చెపుతున్నావు" అన్నాడు అరవింద్ మనస్సులోని బాధను అదిమిపెట్టుకొని.

"తత్వశాస్త్రం కాదు అరవింద్! జీవిత శాస్త్రం. సోషల్ సైన్సు యిది. మొన్న మా యింట్లో జరిగిన గొడవ నా అవగాహనను మార్చింది."

అరవింద్ డీలాపడిపోయాడు. మనసంతా శూన్యం అయిపోయింది. ఏం మాట్లాడాలో తోచలేదు. అలవాటుగా కాళ్ళీడుస్తూ వారి వెనుక నడిచాడు.

ఎవరికి చెప్పుకోలేని వేదన... రాధ... సావిత్రి... లత... నిర్మల... ఎవరూ తన ప్రమేయం లేకుండానే తనకు దూరమైపోయారు. నదీప్రవాహ అందాల్ని చూస్తున్న ఆనందంలో ఎవరూ అరవింద్ మూడ్‌ను గమనించలేదు.

అందరు స్నానాలకోసం కేరింతలు కొడుతూ నది అంచున నీళ్ళతో ఆడుకుంటున్నారు. కొందరు బట్టలు ఉతుక్కుంటున్నారు. కొందరు ఏవో తెప్పలు తీస్తున్నారు. కొందరు బ్రాహ్మణులు చితా భస్మాలను గోదావరిలో ఎలా కలుపాలో చెప్తూ ఏవేవో మంత్రాలు చదువుతున్నారు. గోదావరి నుండి చూస్తే ఒడ్డున ఉన్న దత్తాత్రేయ మందిరం ఎంతో ఎత్తున పర్వతం మీద ఉన్నట్టు కనపడుతోంది. లేత నీలి, ఆకుపచ్చ రంగులో గోదావరి నది నీళ్ళు ఎక్కడినుంచో గల గలా జలపాతంలా సవ్వడి చేస్తూ ప్రవహిస్తున్నాయి.

లత, సావిత్రి గోదావరిలో కాస్త కిందికి స్నానం కోసం దిగారు. మోకాలి లోతు నీళ్ళల్లో కూర్చుని నీళ్ళు చల్లుకుంటూ అదే లోతని భయపడుతున్నారు. నీటి వేగం కాళ్ళ కింది యిసకను తొలగిస్తున్నకొద్దీ కొట్టుకుపోతున్నట్టు భయం.

విక్రాంత్ నదిలో కాస్త ఎగువన స్నానం చేస్తున్నాడు. అక్కడినుంచి అరవింద్ ఈదుకుంటూ ముందుకు సాగాడు.

"అటు వెళ్ళొద్దు. కొట్టుకుపోతారు" అని ఒడ్డునించి కొందరి అరుపులు వినపడ్డాయి.

అరవింద్ అప్పటికే నీళ్ళల్లో మునకలేస్తున్నాడు.

స్నానం చేస్తున్న స్థానికులు నలుగురైదుగురు గబగబా అటుకేసి ఈది అరవింద్‌ని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

అరవింద్ ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడా అని లత మనస్సు పీకింది. ఎవరికీ చెప్పలేదు.

అలా ఆనందం విషాదంగా ముగిసింది.

❖ ❖ ❖

లత విషయంలో దెబ్బతిన్న అరవింద్ ఆ విషాదం నుండి చాలా రోజులు కోలుకోలేదు.

అమెరికా అల్లుడు రాలేక రాధ పెళ్ళి వాయిదా పడింది.

ఎన్నో రాత్రులు తెగ బాధపడ్డ అరవింద్ మామూలైపోయాడు.

రాధ పెళ్ళినాటికి విక్రాంత్ ఫుల్ టైమ్ లెక్చరయ్యాడు.

రాధ పెళ్లికి భారీ ఏర్పాట్లు జరిగాయి.

లత అటుఇటు పరిగెడుతున్నది. కొత్త పట్టుచీరలో ఆమె మెరిసిపోతున్నది.

అరవింద్‌ని చూసి "హాయ్" అని విష్ చేసింది.

"హాయ్, అసలు పెళ్ళికూతురు రాధో-నువ్వో అర్థ కావడం లేదు. నీ హడావిడీ ఆనందం చూస్తుంటే" అంటూ నవ్వుతూ పలకరించాడు అరవింద్.

"విక్రాంత్! ఆరోజు లతను నువ్వు ఫెమినిస్టు అనుకొన్న అప్పటి ప్యాంటు షర్టు డ్రెస్సుకు ఇప్పటి డ్రెస్సుకు పోలికే లేదు గదా." అన్నాడు అరవింద్ లతను ఉడికిస్తూ.

"ఈ పట్టుచీర నేను కొనలేదు. నేను పెళ్లికి రానంటే రాధవాళ్ళ మమ్మి ఈ కొత్త చీర కొనిచ్చింది." సిగ్గుగా అంది లత.

అసందర్భ చర్చకు ఆశ్చర్యపోయి అరవింద్‌ను ఎగాదిగా చూశాడు విక్రాంత్.

గుసగుసగా అడిగాడు విక్రాంత్.

"రాధ మీది కోపంతో యిక్కడే యిదే పందిట్లో లతను పెళ్ళాడతావా ఏమిటి?"

"ఆ మాట నువ్వు చెప్పాలి" అంటూ అర్థోక్తిగా నవ్వాడు అరవింద్.

విక్రాంత్ అయోమయం చూసి లత నవ్వుతోంది.

"నేను రాధను లైక్ చేస్తున్నానని అలిగి లత నన్ను ప్రేమించడం మానేసింది. నీలాంటి వాళ్ళంటే చాలా ఇష్టం అంది లత. మరి యీ పందిట్లోనే పెళ్ళి చేసుకుంటారా!"

విక్రాంత్ ఏమంటాడో అనే ఆందోళన ఓవైపు, ఆసక్తి ఓవైపు... అతన్నే గమనిస్తోంది లత.

"సావిత్రి పెళ్ళయ్యేదాక నేను పెళ్ళి చేసుకోను అని నీకు తెల్సుకద బావా!" అన్నాడు విక్రాంత్ గర్వంగా అరవిందకేసి చూస్తూ.

సగం అంగీకారం లభించినట్టయి లత ముఖం ఆనందంతో విరబూసింది. కాస్త ధైర్యం వచ్చింది. నవ్వుతూ కలుగజేసుకొని అంది.

"ఆమాట అరవింద్ చెప్పాడు విక్రాంత్. ఆ నిర్ణయంతో మీపై నాకు యింకా గౌరవం పెరిగింది. ఆమె పెళ్ళికి ఒక్కచేతి సంపాదన కన్నా రెండు చేతులు కలిస్తే బాగుంటుంది కదా. జగిత్యాలకు వచ్చినపుడు సావిత్రితోటి, అత్తమ్మతోటికూడా చెప్పిన. నీకు చెప్పలేదా?" ఆశ్చర్యంగా అడిగింది లత.

"నాకు ఎవరు చెప్పలేదు. యిప్పుడే నీ ద్వారానే తెల్సింది. నువ్వు చెప్పకుండా వాళ్ళే ముందు ఎందుకుచెప్తారు? నాకు ఆలోచించుకోవడానికి కాస్త టైం కావాలి" అంటూ అబద్దమాడాడు విక్రాంత్. లత కళ్ళల్లో కళ్ళు కలిపాడు విక్రాంత్. ఇద్దరిలో ఏదో ఉత్తేజం.

అరవింద్‌కు పెళ్ళి పందిట్లో యిదంతా ఆసక్తికరంగా ఉంది.

అరవింద్ ఆలోచిస్తున్నాడు విక్రాంత్‌కు ఎంత టైం కావాలో అని. తన పెళ్ళయ్యేదాకనా! లేక సావిత్రి పెళ్ళయ్యేదాకనా?

"అరె కాంత్! తమ్ముడు ఆనంద్‌కు సావిత్రిని ఇచ్చి పెళ్ళిచేస్తే ఎలా ఉంటుంది." అడిగాడు అరవింద్.

విక్రాంత్ మాట్లాలేదు. అమ్మ ఆమాట ఇదివరకే చెప్పివుంది. బాగానే ఉంటుందని అతని కళ్ళు చెప్తున్నాయి. కాని సావిత్రిని చేసుకుంటాడేమో అని ఆశ కల్గించిన అరవింద్ చూపిన పరిష్కారానికి ఆశ్చర్యపోయాడు. అనక నవ్వొచ్చింది.

“ఈ ప్రతిపాదన నాదికాదురా! అమ్మది. సావిత్రికూడా ఒప్పుకుందట.”

“అరవింద్! డాక్టర్లకు యింజనీర్లకు సోషల్ సైన్సెస్ తెలియవు అనుకున్నాను యింతకాలం. కాని నువ్వు సామాజిక అర్థశాస్త్రంతో పాటు బతుకు శాస్త్రం కూడా బాగా చదివినావు. మరి మెడికల్ షాపుతో పాటు ఎక్స్‌రే యూనిట్ కూడా మీ తమ్మునికే యివ్వాలి. కట్నం కింద వాటికి పెట్టుబడి మేమే పెడ్తాంలే” ఏమంటావన్నట్టు లత కేసి చూశాడు విక్రాంత్.

“ష్యూర్!” అంటూ లత విక్రాంత్ చేతిలో చేయికలిపింది.

❖ ❖ ❖

ఏళ్ళు గడిచాయి. అరవింద్ జగిత్యాల్లో తహసీల్ చౌరస్తా సమీపంలో హాస్పిటల్ ప్రారంభించాడు. స్థానికుడు కావడంతో ప్రాక్టీసు తొందరగానే వేగం పుంజుకుంది.

ఆనంద్‌తో సావిత్రికి పెళ్ళయాక తనపై తల్లి దండ్రులు పెళ్ళి చేసుకోవాలని ఒత్తిడి కాస్త తగ్గించారు. లత విక్రాంత్‌ల పెళ్లి సాదాగా జరిగిపోయింది. పెళ్లి రిజిస్ట్రేషన్‌కూడా చేసుకున్నారు.

అరవింద్‌కు హాస్పిటల్‌లో పిల్లల స్పెషలిస్ట్ అవసరం ఎంతో ఉందనిపించింది. నిజామాబాద్‌కు చెందిన అరుణ పిల్లల స్పెషలిస్ట్‌గా హాస్పటల్‌లో చేరింది. ఆమె ఆ యింట్లో పూర్తిగా కలిసిపోయింది. అరుణ అరవింద్‌ల పెళ్లి త్వరలో జరుగుతుందని అందరు అనుకుంటున్నారు.

అరవింద్ చాలామంచి డాక్టర్ అని పేరొస్తూ పేషంట్లరాక పెరుగుతున్న కొద్దీ ఇంటిల్లిపాదికీ సంతోషంగా ఉంది.

తల్లి దేవక్క ఊరకే ఉండలేక కోడలు సావిత్రికి బీడీలు చేయడంలో సహకరిస్తోంది.

ఇక అరవింద్ అరుణను పెళ్ళి చేసుకుంటే నిశ్చింతగా గడపొచ్చు అని తల్లిదండ్రుల ఆరాటం.

చంద్రయ్య మగ్గం నేయడం మానేసి ఇపుడు చిన్నకొడుకు ఆనంద్‌తో పాటు మెడికల్ షాపులో కూర్చుంటున్నాడు.

ఏదో ఆపరేషన్ చేసి రాత్రి తొమ్మిది దాటాక యింటికి చేరాడు అరవింద్. అందరూ అతని కోసమే ఎదురుచూస్తున్నట్టు కూర్చున్నారు.

దేవక్క అందరికీ భోజనం వడ్డించింది. ఆదాయం పెరిగినా భోజనంలో పెద్ద మార్పేమీ లేదు. అన్నం, పప్పు, ఒక కూరగాయ, కాస్త పెరుగు.

"అరుణ మన యింట్ల కల్సిపోయినట్టు ఉంటది. అరుణ గురించి నీ అభిప్రాయం ఏందిరా? నీకు లగ్గమైతే యిగ మాకు నిశ్చింత" అంది దేవక్క.

"అరుణది మన కులం గాదే" ఏమంటుందోనని నవ్వుతూ అమ్మకేసి చూస్తూ అన్నాడు అరవింద్.

"యాడాదాయె పని చేయపట్టి. గాయింత తెల్వదార నాకు" అంది దేవక్క

"అమ్మకు, నాన్నకు ఆ వివరాలన్నీ తెల్సన్నా" అన్నాడు తమ్ముడు ఆనంద్.

"ఈ కాలంల కులం ఎవలు చూస్తున్నర్ర? కాంతయ్య లతను చేసుకోలేదా? ఎంతో మంది డాక్టర్లు వేరే కులపోల్లను చేసుకున్నరని నువ్వే ఎన్నో సార్లు చెప్తివి గదర" అన్నాడు తండ్రి చంద్రయ్య.

అమ్మానాన్నలకిష్టమైందంటే అరుణ తాననుకున్నదానికన్నా ఎక్కువగా యింట్లో కల్సిపోయిందన్న మాట. చిల్డ్రెన్ స్పెషలిస్టు అరుణలో ఎంత వినయం. అయినా తనకు తాను బయటపడకుండా అన్నాడు అరవింద్.

"అయితే అమ్మా! అందరూ కూడబలుక్కున్నారా?"

"నీతోని పెండ్లి జోలి తీసుడే భయమాయె. అరుణ వచ్చిన నాలుగు నెలలకే అనుకువైన పిల్ల అన్పించింది. మన కులం పిల్ల అంత సదువుతే ఎంత నీలుగుడో. డిగ్రీ సదువుతెనే నిర్మలకు ఎంత నీలుగుడు ఉండెనో నీకెరుకలేదా?"

"ఆమె మనస్సేందో తెల్సుకోకుండా గాలి మేడలు కట్టకున్రి" అన్నాడు అరవింద్.

"ఆడపిల్ల నోరిడిసి చెప్తదారా? యాడాది నుంచి ఆ పిల్లను చూస్తున్న. గాయింత తెల్వదా?"

"అమ్మా! వాళ్ళ కల్చర్ వేరు. మన కల్చర్ వేరు. మనది పని చేసికొని బతికే సంస్కృతి. మనది పనిని గౌరవించే సంస్కృతి. అందుకే నేను వద్దన్నా! డాక్టరు తల్లివైనా నువ్వు, మరదలు ఇప్పటికీ బీడీలు చేస్తున్నారు. ఊరికే ఎందుకుండాలనే తత్వం మీది. ఒకరు పని చేస్తే అందరు కూర్చుని తినే సంస్కృతి వాల్లది. వాల్లకు బీడీలు చేయడమన్నా, పని అన్నా అగౌరవం, చిన్నచూపు. కులం, వంశ ప్రతిష్ఠ అంటూ బాగా అహంకారాలకు పోయే తత్వం వారిది. మరోసారి ఆలోచించుకోన్రి." తన మనసులోని మాట బయట పడకుండా గంభీరంగా అన్నాడు అరవింద్.

"మన యింటికి వచ్చే పిల్ల మనకు ముఖ్యం. పిల్ల మంచిది. ఆమె కులంతోని వాళ్ల తత్వాలతోని ఏం పనిరా. మీరిద్దరు డాక్టర్లు కల్సి పని చేస్తే యింకో పది మంది మీతోని దావఖాన్ల బతుకుతరు గదర!" ప్రేమగా అంది దేవక్క

కన్నతల్లి కూడా ప్రేమ, పెళ్ళిని పక్కా వ్యాపార దృష్టితోనే చూడ్డం అరవింద్‌కు కాస్త కష్టం వేసింది. తాను కూడా యిలాగే ఆలోచించాడని గుర్తొచ్చి కొరడాతో కొట్టినట్టు ఒళ్ళు జలదరించింది.

అలా చర్చ సాగి సాగి ముగిసింది.

మూడో రోజుకు అరవింద్ మౌనంగా అంగీకరించాడని దేవక్క ద్వారా తెల్సిన అరుణ "అంతా మీ ఆశీర్వచనం అత్తమ్మా" అంటూ పాదాభివందనం చేసింది.

దేవక్క హృదయం కాబోయే కోడలి పట్ల ప్రేమతో నిండిపోయింది. ప్రేమగా లేవదీసి గుండెకు హత్తుకుంది.

అరవింద్ చొరవ తీసుకోవాలని అరుణ ఆశిస్తోంది.

అరవింద్‌లో మార్పు లేదు.

లోలోపల కలలు కంటూ మనస్సులోనే డ్యూయట్లు పాడుకుంటున్నాడు అరవింద్. అరుణ కూడా అదే పనిలో ఉంది.

వారం తర్వాత నిజామాబాద్‌లోని సొంతింటికెళ్ళిన అరుణ ఉత్సాహంతో అరవింద్ విషయం తల్లి చెవిన వేసింది. ఆమె భర్త చెవిన వేసింది.

అరుణ తండ్రి దయాకర్ రావు ఏదీ చెప్పలేదు. ఆర్థికంగా, వృత్తిపరంగా మంచి సంబంధం అనిపిస్తోంది. కాని కులపరంగా, సాంఘిక హోదా పరంగా వాళ్ళకీయడం చిన్నతనంగా ఉంది.

"నువ్వు సొంతంగా యిక్కడే ప్రాక్టీసు మొదలుపెట్టు. పెళ్ళి సంగతి తర్వాత చూద్దాం. ముందు పది రోజుల్దాకా రాలేనని ఫోన్లో చెప్పేయి" అన్నాడు తండ్రి దయాకర్ రావు.

తండ్రి అంటే ప్రేమతో పాటు భయం ఉన్న అరుణ విలవిలలాడిపోయింది. పదిరోజులు అరవింద్‌ను చూడకుండా ఉండాలా? రాత్రీ పగలూ పేషంట్లతో బిజీగా ఉండడం అలవాటైన తనకు పది రోజులు ఎంత బోర్.

"దేవక్క అత్తమ్మ ఫోన్ చేస్తే ఏమని చెప్పాలె నాన్నా? ఆరోగ్యం బాగులేదని చెప్తే కారేసుకుని అత్తమ్మా, అరవింద్ అందరూ ఇక్కడికి పరిగెత్తుకొస్తే ఎట్లా నాన్నా?" అంటూ అమాయకంగా అడిగింది అరుణ.

"ఇక్కడే క్లినిక్ ఓపెన్ చేస్తున్నా అని చెప్పెయ్యి" అంటూ ఇంట్లోంచి ఏదో పని ఉన్నవాడిలా బయటకు నడిచాడు దయాకర్ రావు.

అరుణకు ఏం చేయాలో తోచక తల్లి దగ్గర కన్నీళ్ళు పెట్టుకుంది.

వారం తర్వాత దయాకర్ రావు యింట్లో తుఫాన్ రేపాడు.

"అరవింద్‌కు ఒకరు కాదు యిద్దరు లవర్‌లున్నారట. ఒకామె రాధ. అమెరికా పోయిందట. మరొకామె లత. విక్రాంత్‌ని పెళ్ళి చేసుకుని కూడా అరవింద్‌తో ప్రేమాయణం సాగిస్తోందట. ఇలాంటి వాడినా నువ్వు ప్రేమించింది?"

"డాడీ! అరవింద్ అలాంటివాడు కాదు. గిట్టనివాళ్ళెవరో మీకు చెప్పి ఉంటారు."

"అరుణా! నీవు చిన్నపిల్లవేమీ కాదు. కాని ప్రేమ గుడ్డిది. నీకు తెలియని విషయాలెన్నో ఉన్నాయి. మరదలు సావిత్రిక్కూడా అతడు అలవాటని అన్నారు. కాని నేనామాట నమ్మలేదనుకో."

"ఛఛ! ఏం మాట్లాడుతున్నారు డాడీ? మెడికల్ ప్రాక్టీసు పోటీలో చాతగాని వాళ్ళెవరో క్యారెక్టర్ మీద ఇలాంటి అభాండాలు వేసి ఉంటారు డాడీ!" ఉక్రోశంగా అంది అరుణ.

అరుణ తల్లి ఏది వాస్తవమో తేల్చుకోలేక ఆలోచనలో పడిపోయింది.

❖ ❖ ❖

రాధ జీవితం అనుకున్నట్టుగా సాగలేదు. అమెరికాలోనే స్థిరపడుదామనుకున్న రాధ ఇండియాకు వచ్చేసింది. వి.యల్.కాంట్ అకస్మాత్‌గా పోవడంతో మనస్సు బాగలేక హైద్రాబాద్ చేరింది. హైద్రాబాద్ చేరాక తిరిగి అమెరికాకు వెళ్ళాలనే ఆలోచనే మానుకుంది.

న్యూయార్కు నుండి రాధ హైద్రాబాద్ వచ్చిందని కరీంనగర్‌లో ప్రాక్టీస్ చేస్తున్న లతకు తెల్సి వారంపైనే అయింది. కరీంనగర్ నుండి సిటీకి వెళ్ళడం వీలుచిక్కలేదు. తనకు వీలు చిక్కాక విక్రాంత్ వెంట రాలేక పోవడం ఏదో వెలితిగా ఉంది.

ఆరేళ్ళ తర్వాత కల్సుకోబోతున్న క్లాసుమేటు రాధను ఇద్దరం కల్సి వెళ్ళి పలకరిస్తేనే బావుంటుందనుకుంది లత. మళ్ళీ ఎపుడు వీలవుతుందో అని ఒక్కర్తే మూడేళ్ళ పాపను తీసుకొని కారులో బయల్దేరింది.

హైద్రాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు మలుపు తిరిగి ఎంతో ఉత్సాహంగా యిల్లు చేరేసరికి రాధ లేదు. ఎటో వెళ్ళింది. లతకు ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చింది. పనిమనిషి మంచి నీళ్ళచ్చి టీ తీసుకు వచ్చింది. లత టీ తాగుతూ ఆ యింట్లో ఆరేళ్ళలో వచ్చిన మార్పుల్ని గమనిస్తోంది. పదేళ్ళ క్రితం ఫ్యాషన్‌గా ఉండిన నాటి అలంకరణ పెద్దగా మారలేదు. అదే ఇపుడు క్లాసిక్‌గా కనపడుతోంది. మనిషి దృష్టి ఎంతలో ఎంత మారుతుంది అని ఆశ్చర్యపోయింది లత.

సత్తయ్య రావడం చూసి గుర్తుపట్టింది లత.

"నమస్కారం అంకుల్! బావున్నారా" అంటూ విష్ చేసింది లత.

కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా రిటైరైనా ఆ హుందాతనం అలాగే ఉంది. పైగా వయసుతో పాటు మరింత పెరిగిందనుకుంది లత.

ప్రతి నమస్కారం చేసి లతను గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేశాడు సత్తయ్య. అది గమనించి తనను తాను పరిచయం చేసుకుంది లత.

"నన్ను గుర్తు పట్టలేదా అంకుల్! లతను, రాధ క్లాసుమేట్‌ను. ఈ యింట్లో ఒక కోరస్ పాట మీద డ్యాన్సు ప్రాక్టీస్ చేశాం. చాలాసార్లు మీ యింట్లో భోంచేశాను. నాకు మంచి డ్రెస్సు లేదు. ఈ పాత డ్రెస్సులో రాధతో నీ పెళ్ళికి రాలేను అంటే ఆంటీ కొత్త పట్టుచీర కొనియిచ్చింది. గుర్తుందాండి." నవ్వింది లత.

లత కూతురు నవ్య ఆసక్తిగా యిల్లంతా పరిశీలిస్తూ అవీ యివీ ముట్టి చూస్తోంది.

సత్తయ్య ముహంలో బల్బు వెలిగింది. అంతా గుర్తొచ్చి నవ్వాడు.

"నీ పేరు లత కదూ! విక్రాంత్ అనే లెక్చరర్‌ను ఆదర్శ వివాహం చేసుకొన్నావు. ఎలా వుంది నీ ప్రాక్టీసు? ఉద్యోగంలో గాని జాయినయ్యావా? ఎంతమంది పిల్లలు?"

"ఒక్కతే పాపండి. అక్కడికి ఆపేద్దాం అని ఉంది. సెకండ్ థాట్‌కి ఇంకో రెండేళ్ళు అవకాశం యిద్దాం. అప్పటికీ ఒక్కర్తే చాలనిపిస్తే ఆపరేషన్ చేసుకోవచ్చు

అని అనుకున్నామండి" అంది లత.

పెద్దాయనతో మాట్లాడ్డం లతకు కాస్త బెరుకుగానే ఉంది.

"మీ ప్రాక్టీసు బాగా నడుస్తోందా?" మళ్ళీ అడిగాడు సత్తయ్య యింకేం అడగాలో తోచక.

"ప్రాక్టీసు బాగా పికప్ అయింది. అర్ధరాత్రిల్లు కూడా నిద్ర లేపి పిలుస్తారు. అపుడపుడు విసుగనిపిస్తుంది రెస్టు దొరక్క. యిపుడు సిటీలో ఉన్న వైద్య సదుపాయాలన్నీ కరీంనగర్‌లోనే దొరుకుతున్నాయి."

"దట్స్ గుడ్! కంగ్రాచ్యులేషన్స్!" అన్నాడు గంభీరంగా సత్తయ్య.

కాసేపు యిద్దరి మధ్యా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని తొలగిస్తూ అడిగింది లత.

"రాధ లేదా అంకుల్? ఎటు వెళ్ళింది? ఎపుడొస్తుంది? నేను ఫోన్ చేస్తే ఈ వేళకు యింట్లోనే ఉంటారని ఎవరో చెప్పారు."

సత్తయ్య ముఖంలో విషాదం అలుముకుంది. గోడకున్న ఏదో ఫోటో కేసి చూస్తూ చెప్పాడు సత్తయ్య.

"ఎవరైనా పాత స్నేహితులొస్తున్నారని తెలిస్తే ఒకసారి ఉంటుంది. ఒక్కోసారి ఉండి ఉండి సమయానికి ఎటో వెళ్ళిపోతుంది. స్టేట్స్‌కి మళ్ళీ వెళ్ళడం లేదని మీదాకా తెల్సిందనే అనుకుంటాను" అంటూ మళ్ళీ అదే ఫోటో కేసి చూశాడు సత్తయ్య.

లత చూచాయగా విన్నది గుర్తుంది. స్టేట్స్‌లో పాప పుట్టాక రాధ భర్తను కోల్పోయింది. వి.యల్.కాంట్‌ది యాక్సిడెంటన్నారు. కాని యాక్సిడెంటో, హత్యో స్పష్టం కాలేదు. మొదట రాధ పాపతో అక్కడే ఉందామనుకుంది. భర్తతో గడిపిన జ్ఞాపకాలు ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసేవి. వాతావరణం మార్పిడి కోసం ఇండియా వచ్చింది. ఇక్కడికి వచ్చాక నిర్ణయం మార్చుకుంది. శాశ్వతంగా యిక ఇండియాలోనే ఉండిపోదల్చుకుంది. ఇంతవరకు తెల్సు తనకు. పాపతో యిలాగే ఉండిపోతుందా? మళ్ళీ పెళ్ళి చేసుకుంటుందా? వగైరా వివరాలేమీ తెలియవు.

"అరవింద్ ఏం చేస్తున్నాడు, ఎక్కడున్నాడు?" ఏదో గుర్తొచ్చి అడిగాడు సత్తయ్య.

"అరవింద్ యం.ఎస్. జనరల్ సర్జన్ చేశాడు. జగిత్యాల్లో ప్రాక్టీసు బాగా నడుస్తోంది. పెద్ద హాస్పిటలే ఓపెన్ చేశాడు" అంది లత.

అరవింద్, రాధ ఎంతో గాఢంగా ప్రేమించుకున్నారు. ఆ విషయం సత్తయ్యకు తెల్సు.

అరవింద్ చాలా పేదవాడని, తండ్రి నేత పని చేస్తూ అప్పు చేసి చదివిస్తే చదువుకుంటున్న కుర్రాడని తెల్సిన సత్తయ్య తన కూతురుకు ఈ సంబంధం తప్పించాలనుకున్నాడు.

"లతా! అరవింద్‌కూ నీకూ పెళ్ళి కుదిరితే ఎంత చక్కని మ్యాచ్" అని అప్పట్లో మెచ్చుకున్నాడీయన.

స్టేట్స్‌లో కార్డియాలజిస్టుగా సెటిలైన వి.యల్.కాంట్ సంబంధం చూసి రాధను ఒప్పించింది ఈయనే. అయితే అరవింద్ గురించి యిపుడెందుకు ప్రస్తావించినట్టు? అర్థం కాక విస్తుపోయింది లత.

"అరవింద్‌కెంత మంది పిల్లలు?" మళ్ళీ అడిగాడు సత్తయ్య.

"అరవింద్‌కింకా పెళ్ళి కాలేదండి."

"అరే! ఇంతకాలం నుండి యింకా పెళ్ళి చేసుకోలేదా!" ఆశ్చర్యపోయాడు సత్తయ్య. ఆలోచనలో పడ్డాడతను.

చేసేదంతా చేసి ప్రేమికుల్ని విడదీసి ఏమీ తెలియనట్టు అడుగుతున్న అతన్ని చూస్తుంటే లతకు కోపం వచ్చింది. తనను తాను అదుపులోకి తెచ్చుకొని సౌమ్యంగా అంది లత.

"భగ్న ప్రేమికుడు కదా అంకుల్! అతను ఎవర్ని మెచ్చట్లేదు" అంటూ బలవంతంగా నవ్వింది లత.

అదీ యిదీ పిచ్చాపాటి మాట్లాడి టైం చూసుకుంది లత. రాధ యిక రాదని నిశ్చయించుకొంది లత.

"మరి వెళ్తానంకుల్. నేను వచ్చి వెళ్ళానని చెప్పండి వస్తాను" అంటూ పాపను తీసుకొని సెలవు తీసుకుంది లత.

❖ ❖ ❖

కరీంనగర్‌లో బిజీ డాక్టర్‌గా మారిన లత రాధ గురించి ఏదో గుర్తొచ్చి అకస్మాత్తుగా అరవింద్‌కు పలకరింపుగా ఫోన్ చేసింది.

"హలో అరవింద్! నేను లతను మాట్లాడుతున్నాను. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ సెమినార్‌లో మీరేదో పేపర్ సమర్పిస్తున్నారట,

కంగ్రాచ్యులేషన్స్" అంది ఫోన్లో లత.

"ఎవరన్నారు?" నవ్వుతూ అన్నాడు అరవింద్.

"ఇంకెవరు విక్రాంత్ చెప్పాడు. నిజమే కదా! అడ్వాన్సు కంగ్రాచ్యులేషన్స్! ఇంతకూ మీ సెమినార్ పత్రం సారాంశం తెల్సుకోవచ్చా? ఇఫ్ యూ హావ్ నో అబ్జక్షన్" నవ్వుతూ అంది లత.

"థాంక్స్ లతా! భారతీయ సంప్రదాయిక శస్త్రచికిత్స విధానాలు, వైద్య పద్ధతి – వర్తమాన అవసరాల్లో వాటి పాత్ర, అభివృద్ధి" అన్నాడు అరవింద్.

"అద్భుతమైన టాపిక్. మీ పేపర్ పెద్ద సంచలనం సృష్టిస్తుందనుకుంటాను. గడ్డలు కోసే మంగలివాళ్ళ వైద్యం గురించి, చీరుకుపోతే పెట్టే నల్లాలం పసరు, వంటి నాటు వైద్యాల్ని గురించి కూడా మీ పేపర్లో చర్చిస్తారా?"

"వై నాట్! తప్పకుండా. నా లక్ష్యం కూడా అదే. వేల ఏళ్ళుగా భారతీయులు యుద్ధాల్లో, యాక్సిడెంట్లలో ఉపయోగించిన వైద్యం, శస్త్ర చికిత్స విధానాలు – వాటి మంచి చెడ్డలు అన్నీ చర్చిస్తున్నాను. దానివల్ల ఆనాటి ప్రజల ఆరోగ్య స్థాయి, జీవన ప్రమాణాలు, అవగాహన కూడా తెల్సి వస్తాయి" అన్నాడు ఉత్సాహంగా.

"ఇలాంటి టాపిక్ మీద నీ దృష్టి ఎలా పడింది."

"మా తాత అంటే మా తల్లి తండ్రి గొప్ప ఆయుర్వేద వైద్యుడు. నిజాం రాష్ట్రంలో యాభయి ఏళ్ళ క్రితం దాకా ఏడు వేల మంది ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆర్.యం.పి. ఆయుర్వేద వైద్యుల్లో ఆరువేల మంది పద్మశాలీలే. అలోపతి వైద్యం ప్రాచుర్యంలోకి రావడంతో వాళ్ళ ప్రాక్టీసు పడిపోయింది. బతుకు చితికిపోయింది. అందులో మా తాత కుటుంబం ఒకటి. బట్టల మిల్లులొచ్చి పద్మశాలీల కులవృత్తిని దెబ్బ తీసాయి. బతుకుదెరువు కరువైంది. అలోపతి వచ్చి దెబ్బదీసింది కూడా పద్మశాలీల బతుకుల్నే. వాళ్ళ బతుకులు శిథిలమై మన బతుకులు బాగుపడుతున్నాయి. మన పూర్వీకుల వారసత్వ వైద్య సంపదను వెలికి తీసి తిరిగి ప్రజల పరం చేయాలన్నది నా సెంటిమెంటు. ఇవన్నీ విక్రాంత్ నీకు చెప్పే ఉండాల్నే?"

"అతను చెప్తేనే గదా తెల్సింది. నిజాం రాష్ట్ర రాజవైద్యుడు హకీం నారాయణ దాసు రాధ అమ్మమ్మకు అన్నయ్యవుతాడట గదా!"

"భలే తెల్సుకున్నావే?" నవ్వాడు అరవింద్.

"థాంక్స్! అన్నట్టు సత్తయ్య అంకుల్ గుర్తున్నాడా? ఈ మధ్య నిన్ను ఫోన్లో చాలాసార్లు గుర్తు చేశాడు. రాధతో నీ ప్రేమను కట్ చేసిందానికి ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నట్టున్నాడు. నువ్వు రాధను పలకరించి రావడానికి వెళ్తానంటూ ముఖం చాటు వేస్తున్నావేంటి?"

"అదేం లేదు లతా! అర్జంటు కేసుల్తో బిజీ. జనరల్ మెడిసిన్ వాళ్ళకు లాగా సర్జన్లకు టైం మన చేతిలో ఉండదని నీకు తెలియదా? గైనకాలజిస్టువి. ప్రసూతులు, ఆపరేషన్లతో నీకూ అంతేగా!'

"అవుననుకో. కాని రాధ ఇండియా వచ్చి రెండు నెలలైపోయింది. ఒక్కసారైనా కల్సి రావాల్సింది. బాధల్లో ఉన్నవారిని ఓదార్చడం బాధ్యత కదా!"

అరవింద్ ఊ కొడ్తూ మౌనం వహించాడు. ఏవేవో గుర్తొచ్చాయి.

ఏదో చెప్తామనుకుని "ఆ ఏం లేదు. మంచిది. యా.యా" ఆ టాపిక్ కట్ చేశాడు అరవింద్.

బాధ! ఎవరికి బాధ! ఆమె బాధల పట్లే స్పందించాలా? ఎదుటివారి బాధల పట్ల ఆమె స్పందించింది ఏపాటి? అమెరికానుండి తనకెపుడైనా ఫోన్ చేసిందా? తనను అసలు గుర్తుంచుకుందా? తనగురించి ఆమెకు బాధేమీ లేనపుడు ఆమె గురించి తాను బాధపడాలా! ఆమెను ఓదార్చాలట. కావచ్చు. కానీ తనని ఓదార్చాలని ఆమె ఏనాడూ అనుకోలేదే. డబ్బు హోదా పెరిగాక తనను అసలు మనిషిలా గుర్తించిందా? డబ్బు హోదా ఉన్నవాళ్ళకు కష్టాలొస్తే పేదలు మాత్రం స్నేహం అనీ, క్లాసుమేటు అనీ, రకరకాల పేర్లతో సాయం చేయాలా? చేసి చేసి తిరిగి వారు కోల్పోయిన సుఖాలను, హోదాలను సమకూర్చే సాధనాలై తాము సమిధలుగా మిగిలిపోవాలా?

లత ఏదేదో చెప్తుంటే ఊకొడ్తున్నవాడల్లా మళ్ళీ అడిగేసరికి ఏంటీ సరిగ్గా వినపడట్లేదు అన్నాడు అరవింద్.

"అది సరే గానీ మీ హస్పటల్ అనస్థటీషియన్‌గా ఎవరొస్తున్నారు? అపుడపుడు అర్జంట్ కేసులకు నాక్కూడా కావాలి."

"లతా! నాక్కూడా కష్టంగా ఉంది. నాలుగు ప్రయివేటు హాస్పిటల్స్. ఒక్కడే అనస్థటీషియన్. చాలా యిబ్బందిగా ఉంది. వస్తానన్న టైంకు రాడు. అన్నీ రెడీ చేసి ఎదురుచూడ్డం. అటు పేషెంట్ల బంధువులకు టెన్షన్. ఇటు మనం చాలా రిస్కు ఫేస్ చేయాల్సివస్తోంది."

"రాధను పిలిస్తే ఎలా ఉంటుంది? కొత్త పరిసరాల్లో పడి కాస్త తేరుకుంటుంది. ఏమంటావు?"

అరవింద్ ఉలిక్కిపడ్డాడు. "ఏంటి రాధనా? నా హాస్పటల్‌లోనా?" ఎందుకో అరవింద్ గుండె లబ్‌డబ్‌మని కొట్టుకుంటూ వేగం హెచ్చింది.

"పర్మనెంటుగా కాదులే. కొద్దిరోజుల కోసం. విజిటింగ్ అనస్థటీషియన్‌గా అర్జంట్ కేసుల్లో పిలిపించుకోవచ్చు. కొంతకాలం రాధను మా యింట్లో ఉండుమని కోరుదామనుకుంటున్నాను. నీ అభిప్రాయం?"

"ముందు విక్రాంత్‌ని అడిగావా?"

"విక్రాంతే ఈ సూచన చేశాడు. నీ అభిప్రాయం కూడా కావాలి."

"నేను ఆలోచించి చెప్తాను. ముఖ్యంగా అమ్మానాన్నలను అడగాలి."

లత ఫోన్లో నవ్వింది. ఇందులో నవ్వడానికేముందో. పేదవాళ్ళయిన తమ అమ్మానాన్నలంటే లతక్కూడా యింత చిన్న చూపేమిటో అర్థం కాదు. అనుకున్నాడు అరవింద్.

"అరవింద్! రాధ మీ యింటి కోడలుగా రావట్లేదు. ఫ్రెండ్‌గా డాక్టరుగా వస్తుంది."

అరవింద్ యిబ్బందిగా ఫీలయ్యాడు. తన ప్రేమను నిరాకరించిన రాధను క్షమించాల్సిన స్థాయికి వచ్చాక ఎందుకో క్షమించలేకపోతున్నాడు. ఎపుడో లత అన్నట్టు యిది మగ అహంకారమా?

లత ఫోన్ పెట్టేశాక అరవింద్ తీవ్ర ఆలోచనలో పడ్డాడు. లత ఆలోచనలో వాస్తవికాంశం ఉండొచ్చు. కాని యిదే ప్రతిపాదన నిర్మల విషయంలో ఎందుకు చేయలేకపోయింది.

నిర్మల భర్త పోయి మూడేళ్ళవుతోంది. భర్త పోయినవాళ్ళను చేసుకోవాల్సి వస్తే నిర్మలనే చేసుకోవడం కనీస బాధ్యత. వాళ్ళ నాన్న నారాయణమామ పెట్టిన పెట్టుబడితోనే తాను మెడిసిన్ పూర్తి చేయగలిగాడు. నిర్మలను పెళ్లి చేసుకో అని అడిగితే అపుడు తాను అదే కట్నం యిచ్చి తమ్ముడికివ్వచ్చు గదా. ఆ కట్నంతో ఇంటర్ తప్పిన తమ్మున్ని షాపు పెట్టించి పెద్ద సేటును చేయచ్చు గదా అని అడిగాడు. నారాయణమామ అహం దెబ్బతిని నిర్మలకు మరీ తొందరపడి పెళ్ళి చేశాడు. నిజానికి అలా తొందరపడి ఉండకపోతే తాను నిర్మలను పెండ్లి చేసుకొనేవాడేమో. నారాయణమామ ఆ అవకాశం యివ్వలేదు.

నిర్మల భర్త మదన్ ఎంతో సిన్సియర్. అయితే మరీ యింత సెన్సిటివ్ అని అతను ఆత్మహత్య చేసుకునే దాకా ఎవరికీ తెలియదు. రెండుసార్లు అయ్యేయస్ పాసైనప్పటికీ యింటర్వ్యూలో కావాలని పడగొట్టారని కనీసం గ్రూప్ వన్ లోనైనా న్యాయం జరుగుతుందనుకుంటే అంతకన్నా హీనంగా పలుకుబడి, పైరవీలు. ఖచ్చితంగా వస్తుందనుకున్న గ్రూప్ వన్ కూడా మిస్సవడంతో తట్టుకోలేకపోయాడు. నిర్మల అయిదో నెల క్యారియింగ్ అనైనా చూడకుండా అర్ధాంతరంగా నిష్క్రమించాడు. అదంతా గతం. ఇదంతా తెల్సిన లత నిర్మలక్కూడా ఒక కొత్త జీవితం యివ్వాలి అని యిన్నేళ్ళుగా ఎందుకు ప్రస్తావించలేకపోయింది?

ఈ ఆలోచనల్తో అరవింద్ మనస్సంతా వికలమైంది. ఎపుడూ కలవారి కష్టాలే కష్టాలుగా గుర్తొస్తాయా? పేదవారికి అవే కష్టాలు వస్తే గుర్తు రావా? ఫేర్ కాపీ రాస్తున్న సెమినార్ పేపర్‌ని మూడ్ చెడిపోయినట్టయి పక్కన పెట్టి లేచాడు అరవింద్.

అరుణని ఫోన్ చేసి అర్జంటుగా పిలిపించుకోవాలి అనుకున్నాడు అరవింద్. అరుణే ఫోనెత్తింది.

అరవింద్ కంఠం విని పులకించి పోయింది అరుణ.

నాన్న లేడు. ఇదే సరైన సమయం అని అమ్మకు చెప్పి వెంటనే బయల్దేరింది.

అరుణకు కాస్త యింగ్లీషు బాగా వచ్చు. ఏవేవి సంక్షిప్తం చేసి, ఏవి చర్చించాలో చెప్పి సెమినార్ పేపర్ ఫేర్ కాపీ చేయమని యిచ్చాడు అరవింద్. అరుణ రాకతో దేవక్క చంద్రయ్య, ఆసుపత్రి సిబ్బంది, పేషెంట్లు, సావిత్రి ఎంతో సంతోషించారు.

❖ ❖ ❖

లత విక్రాంత్‌లతో పాటు ఈసారి అరవింద్ రావడం సత్తెయ్యకు సంతోషం కలిగించింది. అతనికి రాధ పట్ల గల ప్రేమను తేలికగా తీసుకొని అవమానించి పంపిన విషయం గుర్తొచ్చి సత్తెయ్యకు అరవింద్‌తో మాట్లాడ్డానికి ముహం చెల్లలేదు. అరవింద్ వెంట వచ్చిన అరుణను అతని శ్రీమతేమో అని ఆశ్చర్యంగా చూశాడు సత్తెయ్య. రాధ కూడా అరుణను ఆసక్తిగా చూసింది.

లత అరుణను పరిచయం చేసింది.

"డాక్టర్ అరుణ చిల్డ్రెన్ స్పెషలిస్టు నిజామాబాద్ నేటివ్. ప్రస్తుతం జగిత్యాల్లో అరవింద్ హాస్పిటల్‌లో పనిచేస్తోంది."

రాధ అరుణను విష్ చేసింది. కుశల ప్రశ్నలయ్యాక ఊసుపోక కోసం అడిగాడు విక్రాంత్, "రాధా! అమెరికన్ లైఫ్ అద్భుతంగా ఉంటుందంటారు. ఆరేళ్ళలో మీకెలా అన్పించింది?"

అవన్నీ గుర్తు చేసికోవడం యిష్టంలేనట్టుగా విషాదంతో యిబ్బందిగా చూసింది రాధ. లత కూడా అడిగేసరికి వేదాంత ధోరణిలో అంది రాధ.

"ఎవరి కోసం బతుకుతున్నామో, ఎందుకోసం బతుకుతున్నామో ఆలోచించుకొనే టైం లేనంత వేగంగా అక్కడి జీవితం సాగుతుంది. ఎవరో అన్నట్టు అది యవ్వనకాల దేశం. జీవితంలోని మిగతా దశలకు అంతగా పనికి రాదు. ఆ వే ఆఫ్ లైఫ్‌ను, స్టాండర్డ్ ఆఫ్ లివింగ్‌ను తట్టుకోవడం కష్టం."

"అక్కడ కాంట్రాక్టు మ్యారేజెస్ ఉంటాయట గదా!" అరుణ అమాయకంగా అడిగింది.

"మన భారతీయుల్లో అలాంటివేమీ లేవు. మనవాళ్ళు అక్కడా కూడా యిలాగే ఉంటారు. విడాకులు సెకండ్ మ్యారేజి మాత్రం యిక్కడంత కష్టం కాదు. ఇక్కడంత తప్పూ కాదు."

"ఇక్కడ కూడా బిలో మిడిల్ క్లాసులో అవి మొదట్నుంచీ ఉన్నాయి. వాటిని వాళ్ళు ఎపుడూ తప్పుగా భావించలేదు. మా అమ్మకు నేను సెకండ్ మ్యారేజీ కూతుర్నని మీకు తెల్సుగా! అయితే ఈ మేన్ స్ట్రీం మీడియా సృష్టిస్తున్న సంస్కృతిని అడాప్ట చేసుకొని సాంస్క్రిటైజ్ అవుతూ యిప్పుడు తప్పని కొందరనుకుంటున్నారు. మరో వైపు ఫెమినిస్టులు దాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనికి బదులుగా మన పూర్వీకుల తల్లి సంస్కృతిని, మాతృస్వామిక వ్యవస్థని హైలైట్ చేస్తూ మేన్ స్ట్రీం కల్చర్‌గా మీడియాలో చూపించగలిగితే ఫెమినిజంకన్నా వంద రెట్లు శక్తితో అద్భుతాలు సృష్టించవచ్చు" అంది లత.

"అబ్బ! యిక్కడ కూడా నీ ఫెమినిస్టు లెక్చర్లు దంచడం మొదలెట్టావూ" నవ్వుతూ విసుక్కుని, రాధని అడిగాడు విక్రాంత్.

"రాధా! లత లెక్చర్లకేం గానీ మీ అత్తగారి తరపువాళ్ళు ఇప్పుడు మీ పట్ల ఎలా ఉన్నారు. ఐ మీన్ ....." ఆ వాక్యం ఎలా పూరించాలో తోచక ఆగిపోయాడు విక్రాంత్.

"అన్నయ్యా! నాకు వాళ్ళతో అంతగా అటాచ్‌మెంట్ పెరగలేదు. పెళ్ళయ్యాక ఏడాదిలోపే స్టేట్స్‌కి వెళ్ళాను గదా! వెళ్ళేదాకా ఏ కొద్ది రోజులో తప్ప ఆ ఏడాది కూడా మా యింట్లోనే ఉండిపోయాను" అంది రాధ.

"ఐ మీన్ మీ కుటుంబ సంబంధాలు కాదు. వారితో మీ ఆర్థిక లావాదేవీలు ఎలా ఉన్నాయి, నామినీగా ....." అంటూ అర్థోక్తిగా అడిగాడు విక్రాంత్.

"ఓ అదా అన్నయ్యా! నామినీగా నా పేరే ఉంది. దాంతో అతను చనిపోయాక చాలా పెద్ద గొడవైంది. వాళ్ళది జాయింటు ఫ్యామిలీ. ఆయనొక్కడే ఇన్‌కం సోర్స్. అందరి చదువులు, అవసరాలను మేమే చూసేవాళ్ళం. మా చిన్నాడపడుచుకు ఒక పెద్ద సంబంధం నిశ్చయమైనాక యిలా జరిగింది. ఇవన్నీ నాన్న చూసుకున్నాడు. లీగల్‌గా అన్నీ నీకే చెందుతాయని నాన్న పట్టుబట్టాడు. అతనే పోయాక డబ్బు గురించి నాకు ఆసక్తి పోయింది. పైగా నాకన్నా వాళ్ళకే డబ్బు ఎంతో అవసరం. మూడింట రెండొంతులు వాళ్ళకే ట్రన్స్‌ఫర్ చేస్తూ అగ్రిమెంటుపై సంతకాలు జరిగాయి. ఇదంతా పూర్తయ్యేసరికి వాళ్ళతో అటాచ్‌మెంట్ ఆ కాస్తా లేకుండా పోయింది. లత ఇంతకు ముందు వచ్చినపుడు ఈ గొడవల వల్లే మనసంతా ఏదోలా ఉండి కలవలేక పోయాను. ఇపుడవన్నీ గత జన్మ విషయాలు. ఆ విషయాలు వదిలేసి వేరే ఏదైనా మాట్లాడుకుందాం ప్లీజ్" విషాదంగా నవ్వే ప్రయత్నం చేసింది రాధ.

"అంటే యిపుడు నువ్వు కొత్త జన్మ ఎత్తి మళ్ళీ కొత్త జీవితం జీవించదానికి నిర్ణయించుకున్నావు. నువ్వు తొందరగా కోలుకున్నందుకు నాకు సంతోషంగా ఉంది."

"ఈ పాపకు వాళ్ళ డాడీతో బాగా అటాచ్‌మెంట్. ఎపుడూ డాడీ కావాలని ఏడుస్తూ ఉంటుంది. ఎక్కన్నించి తేను? ఎలా సముదాయించను? ఎలా చిక్కి పోయిందో చూడండి" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది రాధ.

అరుణ ఆప్యాయంగా ఆ పాపకేసి చేతులు చాచింది. ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది. "అప్పుడే పాపకు ఎనీమియా (రక్త హీనత). న్యూట్రిషన్ ఫుడ్ తినిపించాలి" అంది అరుణ.

"విన్నావా లీనా! ఆంటీ ఏం చెబుతోందో. ఇకనుంచి అన్నం తింటావుగా!" అంటూ అడిగింది రాధ. అలాగే అని తల వూపింది లీనా.

అరవింద్‌కు లీనా రాధ చిన్నప్పటి ఫోటోలా ఉందనిపించింది.

అందరూ అక్కడే భోంచేశారు.

"రాధా! కొంతకాలం నాతో వచ్చెయ్యి. విక్రాంత్ వారానికి రెండ్రోజులే యింట్లో ఉంటాడు. నీవు నాకు తోడుగా ఉన్నట్టుంటుంది. నీక్కూడా పరిసరాలు ఛేంజయి ఫ్రెష్‌గా ఉంటుంది. పాత జ్ఞాపకాల్తో ఉంటే కొత్త జీవితం గెల్చుకోవడం సాధ్యం కాదు" అంది లత.

లెక్చరర్‌గా తన లోకం తనది అనుకున్నాడు విక్రాంత్. లతకు తాను ఏనాడూ ప్రొఫెషనల్‌గా తోడు కాలేకపోయాడు.

"ఇద్దరు డాక్టరమ్మలతో మీ ప్రాక్టీసు మూడు పువ్వులు ఆరు కాయలవుతుంది" అంటూ నవ్వాడు విక్రాంత్.

ఎంతో ఒత్తిడిమీద రాధ సరేనంది. సత్తెయ్యకు కాస్త సంతోషం అన్పించింది. సాయంత్రమే తమతో పాటు రాధను బయల్దేరదీసింది లత.

❖ ❖ ❖

అరుణతో రాధ ఏదో చెప్తోంది.

అసిస్టెంటు బాయ్ డోర్ తీసి, "నిర్మల మేడం వచ్చింది సార్. రమ్మంటారా?" అంటూ అడిగాడు అరవింద్‌ని. పంపుమన్నట్టు తల పూపాడు అరవింద్.

చంకలో పాపతో చిక్కిన శరీరంతో ప్రవేశించిన నిర్మల అందరికీ సమస్కరించింది. అరుణకు చూపించుమన్నాడు అరవింద్.

అరుణ అవీ యివీ పరీక్షలు చేసింది.

"ఇంత చిన్న పాపకు వస్తున్న నొప్పి అపెండిసైటిస్ అయి ఉండదు. ఏదో పడని వస్తువు తిన్నట్టుంది. మీరేం కంగారు పడకండి" అంటూ మందులు రాసింది అరుణ.

"కాసేపు కూర్చో" అంటూ అరవింద్ రాధను నిర్మలకు పరిచయం చేశాడు. నిర్మలను రాధకు పరిచయం చేశాడు.

"రాధా! నేను వీళ్ళ డాడీ పెట్టిన పెట్టుబడితోనే చదువుకోగలిగాను. అఫ్‌కోర్స్ వడ్డీతో సహా యిచ్చేశాననుకో. అయినా అలా వడ్డీకైనా నమ్మి యిచ్చేవాళ్ళు కూడా కావాలి గదా! స్టేట్స్‌లోని కార్డియాలజిస్టుతో నీ పెళ్ళి సెటిలైందని నాతో దాచకుండా వెంటనే చెప్పేసి ఉంటే నేను ఈ నిర్మలనే పెళ్ళి

చేసుకొని ఉండేవాడిని. అట్లా నీతో పెళ్ళి కాకుండా పోయింది. నిన్ను చూసుకొని నిర్మలను వద్దంటే యిటు నిర్మలతో పెళ్ళి కాకుండా పోయింది" అంటూ వేదాంతిలా నవ్వాడు అరవింద్.

జరిగిపోయిన విషయాలను అంత స్పోర్టివ్‌గా చెప్తున్న అరవింద్‌కేసి గౌరవంగా చూసింది నిర్మల.

అరవింద్‌లో ఎంతో హృదయ సంస్కారం. కాని తానపుడు అరవింద్‌ను తమ వద్ద పనిచేసే పనిమనిషి కొడుకన్నంత తేలికగా చూసింది. తనకంత గర్వం ఎందుకుండిందో.

"నేను అపుడు చాలా గర్విష్టిగా ఉండేదాన్ని లెండి" నిర్మల పేలవంగా నవ్వింది.

❖ ❖ ❖

ఏదో పార్టీ టికెట్ సంపాదించి ఎమ్మెల్లేగా పోటి చేసి అయిదు వేల ఓట్ల తేడాతో ఓడిపోయేసరికి నారాయణ సేటు కొడుకు శ్రీనివాస్ దివాలా తీసినంత పనైంది. రాజకీయాల్లో తిరగడంతో వ్యాపారం కుంటుపడింది.

ఇటు చూస్తే నిర్మల బతుకు యిలా అయిపోయింది. అరవింద్ ప్రోత్సాహంతో తమ్ముడు ఆనంద్ శ్రీనివాస్‌కు కుడిభుజంలా తిరిగాడు.

మెడికల్ షాపులో యిపుడు పూర్తిగా చంద్రయ్యే కూర్చుంటున్నాడు.

ఎంతో కష్టపడి సాధించిన అభివృద్ధినుంచి వెనక్కి మళ్ళినట్టనిపిస్తోంది నారాయణ సేటుకు.

బి.పి. పెరగడంతో నారాయణ సేటును అరవింద్ హాస్పిటల్‌కు తరలించారు.

"నారాయణమామ తొందర పడకపోతే నేను నిర్మలనే చేసుకొనేవాడిని" అని అరవింద్ అన్నాడని నిర్మల చెప్పిన మాటలోని అంతరార్థం ఏదేదో ఊహించాడు నారాయణ సేటు.

తన పక్కనే కూర్చుని అరవింద్ తనను పరీక్షిస్తుంటే నారాయణసేటు కళ్ళల్లో నీళ్ళు.

"మామా! కంగారేమీ లేదు. నార్మల్‌గానే ఉంది. టెన్షన్ పెట్టుకోకండి" అన్నాడు అరవింద్.

నారాయణసేటు మంచం పక్కన నిర్మల పాపనెత్తుకొని కూర్చుంది.

నాన్న కన్నీరెందుకో నిర్మలకు తెలుసు. అరవింద్‌కు తెలియదు.

"బతుకుతానో లేదో" రెండు చేతులు జోడించాడు నారాయణసేటు. అతని ప్రార్థన అర్థం వేరు.

చంద్రయ్య, దేవక్కలు నిర్మలకు ధైర్యం చెప్పారు. ఎందరెందరో చూడ్డానికి రావడంతో హాస్పిటలంతా మూడు రోజులు సందడిగా మారిపోయింది.

నారాయణను నాలుగోరోజు సిటీకి తరలించారు. అంబులెన్సు సిద్దిపేట చేరకముందే సిటీకి వెళ్ళాల్సిన అవసరం తీరిపోయింది.

నిర్మల దుఃఖానికి అంతులేదు.

ఒక ఎమ్మెల్లే తండ్రిలా ఎందరెందరో పురప్రముఖులు, ఎంతో మంది కులసంఘ నాయకులతోను నారాయణసేటు శవయాత్ర సాగింది.

శ్రీనివాస్ అగ్గి పట్టుకొని ముందు నడిచాడు. నారాయణసేటు శవాన్ని అరవింద్, ఆనంద్, చంద్రయ్యలతో ఎవరెవరో పోటీటు పడి భుజం మార్చుకున్నారు.

❖ ❖ ❖

నెలలు గడిచాయి. నిర్మల అన్న శ్రీనివాస్ వ్యాపారం మూలబడింది. రాజకీయాలే అతనికి సర్వస్వమయ్యాయి. నిర్మల వదిన పురమాయింపుల్లో నిర్మల తన యింట్లోనే పనిమనిషిలా అయిపోయింది.

ఇలా కాదని ప్రైవేటు స్కూల్లో టీచరుగా ఉద్యోగంలో చేరింది నిర్మల. నిర్మల మళ్లీ మామూలు మనిషి అయింది. జీవితం అంటే తెలిసిరాసాగింది. అన్నిటినీ తట్టుకునే శక్తి సంపాదించుకుంది. ఎంత గారాబంగా పెరిగిన ఆ పిల్ల బతుకు ఎట్లైపోయె అని నిర్మలను చూస్తుంటే దేవక్క మనస్సు తరుక్కుపోతోంది.

వియ్యపురాలైన సక్కుబాయి యింటికి వెళ్ళింది దేవక్క నిర్మల గురించి అయ్యో పాపం అని సానుభూతిగా అంది దేవక్క

"ఎందుకు పాపం అనాలె వదినే? చేసిన పాపం ఉత్తగనే పోతాదో. మమ్ముల ముంచె. మందిని ముంచె. కులాన్ని ముంచె. కుల సంగాన్ని ముంచె. అందర్ని ముంచి తానొక్కడు మీదికి తేలితే – ఆ గోస తాకదా? నా ఉసురు తలుగదా" అంది సక్కుబాయి ఈసడింపుగా.

"తండ్రి పాపం చేస్తే బిడ్డ ఏం చేసిందో. పోయినోడు పాయె. ఉన్న గోసంతా ఆ పిల్లకేనాయె. మంచిగ బతికినపుడు కానకపాయిరి. ఇపుడు రెండో సంబంధం ఎవలు దొరుకుతరు?"

"ఆడు నన్ను ముండ మోపిచ్చినట్టు వాని బిడ్డ ముండ మోసింది" అంటూ గతమంతా తవ్వింది సక్కుబాయి.

విక్రాంత్ అలా మాట్లాడవద్దని వారించాడు. సక్కుబాయి ఊరుకోలేదు.

తన పెనిమిటీ, నారాయణసేటూ ఒక కాడనే బట్టలు నేసేవాళ్ళు. చేనేత సహకార సంగం కోసం యిద్దరు కలిసే తిరిగిన్రు. తన పెనిమిటిని సంగంలో నెగలనీయలేదు. తన పెనిమిటి నేత కార్మికుడుగానే పోయాడు. వీడు ముంచిన రందితోనే పోయిండు.

"ఇంత దివాలైనా ఇపుడు కూడా మా కన్నా మంచిగనే బతుకుతున్నారు. అయ్యో అనుడేంది? ఆ పిల్లకేమైన నీలుగుడు తక్కువుండెనా? అది ఎన్నడన్న నన్ను చిన్నీ (చిన్నమ్మా) అని పిలిసిందా!"

"అవన్ని కాంతయ్య, సావిత్రి మరిసినా నువు మాత్రం మరువలేదో వదినే. మన కండ్ల ముంగట పెరిగిన పిల్ల గోస అన్పిస్తంది" అంటూ బాధపడింది దేవక్క

❖ ❖ ❖

"రాధ వచ్చిన్నించి అరుణ మూడీగా ఉంటోంది" బెడ్ మీద వెల్లకిలా పడుకొని లతకేసి చూస్తూ అడిగాడు విక్రాంత్.

"వాళ్ళ నాన్న ఏదో అన్నాడట. ఈ మధ్య అరవింద్‌కూడా మూడి అయి మతిమరుపు ఎక్కువై పోయింది" అంది లత ఏదో ఫెమినిస్టు పుస్తకం తిరగేస్తూ.

"నీవు అనవసరంగా అరవింద్‌కు కొత్త సమస్యలు సృష్టిస్తున్నావనిపిస్తోంది. రాధను నువ్వు మళ్ళీ తన జీవితంలోకి తీసుకురాకపోతే అతను అరుణను పెళ్ళి చేసుకొని ఉండేవాడు. ఇప్పుడు అరుణను చేసుకోవాలో రాధను చేసుకోవాలో తేల్చుకోలేక సతమవుతున్నాడు" అన్నాడు విక్రాంత్.

"సమస్య యింత క్లిష్టమవుతుందనుకోలేదండి. పరస్పరం ప్రేమించు కున్నారు కాబట్టి అరవింద్ రాధలకు ఒక్కటి కావడానికి జీవితం మరో అవకాశం యిచ్చిందనే అనుకున్నాను."

లత అమాయకత్వానికి జాలిపడ్తూ నవ్వాడు విక్రాంత్.

"సమస్య నీకు అంత సరళ రేఖలా కనపడుతోందా? ఇంత జరిగాక కూడా నీకు సమస్య అర్థం కాలేదన్న మాట. జీవితమంటే పాత సిన్మా ముగింపు అనుకున్నావా? నీ సంప్రదాయ ఊహాత్మక ఆదర్శాల దృష్టి అలాగే ఉందన్నమాట. ఇక ఫెమినిజం చదివి ఏం నేర్చుకున్నట్టు?"

"అంటే అరుణను చేసుకొంటాడంటారా?"

"ఇప్పుడది సాధ్యం అనుకోను. కాని నువ్వు రాధను సన్నిహితం చేసేసరికి అదే సానుభూతికి అర్హమైన నిర్మల కూడా అతనికి గుర్తొచ్చింది. రాధ రావడం వల్ల అరవింద్‌కు నిర్మల కొత్త ప్రాబ్లం అయింది."

"అంటే ఇపుడు నిర్మలను చేసుకొంటాడంటారా?"

"అది కూడా చెప్పలేం. నువ్వు రాధను అతని నెత్తిన రుద్దకపోయి వుంటే ఖచ్చితంగా అరుణనే పెళ్ళి చేసుకొని ఉండేవాడు. అసలు అతని జీవితంతో ఆటలాడుకుంటున్నది రాధో, నిర్మలో, అరుణో, విధో కాదు. నీవు."

లత తల గిర్రున తిరిగిపోయింది. "ఏమిటి మీరనేది?" అంటూ పక్కమీంచి అకస్మాత్తుగా లేచి కూర్చుంది.

"ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది. నిర్మల పెళ్ళయిపోయి, రాధ పెళ్ళి సెటిలయ్యాక నిన్ను చేసుకొందామనుకున్న అరవింద్‌కు ఆపాటికే నువ్వు అలిగి నన్ను చేసుకొని అపుడూ సమస్య సృష్టించావు. సకాలంలో గమనించి కాపాడకపోతే అరవింద్ ధర్మపురి గోదావరిలో ఆ రోజే చనిపోయి వుండేవాడు. పైపైన చూసేవారికి అరవింద్ కష్టాలకు రాధే కారణంగా కనపడుతుంది. కాని ఆ కష్టాలన్నీ నీ వల్ల వచ్చినవే. ఇప్పుడూ అలాగే చేశావు. లతా! గతాన్ని గతంలోలాగే వర్తమానంలో పరిష్కరించడం సాధ్యం కాదు. ఇది గమనించలేదు నువ్వు."

లత ఆలోచిస్తున్నకొద్దీ తానెంత పెద్ద పొరపాటు చేసింది తెల్సి రాసాగింది. నిర్మలను, రాధను చూసి అరుణ తనలాగే అలిగి మరొకర్ని ప్రేమిస్తే ... అరవింద్ ఏమైపోతాడో.

"అరవింద్! నాకు తెలియకుండానే నీ జీవితంలో ఎంత చిచ్చుపెట్టాను" అంటూ తల బాదుకుంది లత. అరవింద్ ఈ సమస్య పరిష్కరించుకోలేక ఆత్మహత్య చేసుకోడు గదా అని వణికిపోయింది లత.

"అరవింద్ గురించి నాకు భయంగా వుందండి. ఇపుడేం చేద్దామంటారు?"

"ప్రస్తుతం మనం చేయగలిగిందేమీ లేదు. కాని ఒకటి తోస్తోంది. ముందు రాధను సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించమని చెప్పు. అప్పుడు అరవింద్‌కు ఆలోచించుకోవడానికి కాస్త వీలు చిక్కుతుంది."

"అప్పుడు ఎవర్ని చేసుకొంటాడంటారు?"

"ఇప్పుడే ఎలా చెప్పగలం? కాలమే నిర్ణయిస్తుంది. రాధ దూరంగా ఉంటే అతని మనస్సు నుంచి నిర్మల కూడా దూరమై అరుణనే చేసుకోవచ్చు. ఈలోగా అరుణ నీలాగా అలిగి మరొకర్ని ప్రేమిస్తే నిర్మలను చేసుకోవచ్చు. ఎలా చెప్పగలం?" అన్నాడు విక్రాంత్. "నాకు నిద్ర వస్తోంది" అంటూ ఒరిగాడు.

ఒకటి చేయబోతే మరొకటి అయిందేమిటి? అనుకుంటూ తలపట్టుకు కూర్చుంది లత. ఎపుడు నిద్ర పట్టేసిందో.

అనవసరంగా అరవింద్ జీవితంలో ప్రవేశించానని బాధతో రాధ ఆత్మహత్య చేసుకొంది. ఎటూ తేల్చుకోలేక అదే సమయంలో అరవింద్ ఆత్మహత్య చేసుకొన్నాడు. అరుణ బిగ్గరగా ఏడుస్తోంది.

లత నిద్రనించి అకస్మాత్తుగా లేచింది. అదంతా కల అని అర్థం అయ్యేటప్పటికీ లత కాళ్ళు చేతులు వణుకుతున్నాయి.

"ఏమండీ. ఏమండీ అంటూ ఎంత పిలిచినా నిద్ర లేవలేదు విక్రాంత్. నైటీతో బయటకు నడిచింది లత. మరో బెడ్‌రూంలో రాధ పాపను పొదువుకొని హాయిగా నిద్రపోతోంది. కాస్త గుండె దడ తగ్గింది. ఫోన్ రింగ్ చేసింది లత.

"హలో! డాక్టర్ లతను మాట్లాడుతున్నాను. డా॥ అరవింద్ గారున్నారా?"

"నమస్కారం మేడమ్. నిర్మల మేడం నిద్ర మాత్రలు మింగింది. డాక్టర్‌గారు బిజీలో ఉన్నారు. పిలువుమంటారా?"

"వద్దు" అంటూ ఫోన్ పెట్టేసి ఏడుస్తూ కూర్చుంది లత. కర్తవ్యం గుర్తొచ్చి గబగబా డ్రెస్సు మార్చుకుంది. అలికిడికి రాధ లేచింది. రాధ కూతుర్ని లత కూతురు దగ్గరికి నిద్రలోనే ఎత్తుకెళ్ళి పడుకోబెట్టింది. నిర్మలను బతికించుకోవాలని ఆతృత. కారు వేగం అందుకుంది.

రాత్రంతా కంటిమీద కునుకు లేదు. ఉదయం పదింటికి నిర్మలకు ప్రాణాపాయం తప్పిందని ఊపిరి పీల్చారు డాక్టర్లు.

నిర్మల అన్న శ్రీనివాస్ ఆందోళన తగ్గింది.

తన భవిష్యత్తేమిటో నిర్ణయించుకోక తప్పదనుకుంది రాధ. తనకు డబ్బు మీది వ్యామోహం భర్త చనిపోయాక పూర్తిగా చచ్చిపోయింది. డబ్బు మీద, ధనవంతుల మీద ఒక రకమైన ఏవగింపు కూడా కలుగుతోంది. కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటులో పని చేసి నాన్న కూడబెట్టిందంతా ప్రజల్ని దోచిన అవినీతి సొమ్మే కదా అని స్టేట్స్ నుండి యిండియా వచ్చాక జ్ఞానోదయం అయింది. అరవింద్‌కు దూరంగా ఉండాలి. తన బతుకు తాను బతకాలి. పేదలకు సేవ చేయాలి అనుకుంది.

రాధ తండ్రి సత్తయ్య దిల్‌సుఖ్‌నగర్‌లో సొంతింట్లో క్లినిక్ ప్రారంభించు కొమ్మని ఎంత పోరినా రాధ ససేమిరా అంది. నెల తర్వాత రాధ సిరిసిల్లలో సొంతంగా క్లినిక్ ప్రారంభించింది. కొంతకాలం తోడు కోసం నిర్మలను రమ్మంది. ఊరు మారడానికి ఇదొక అవకాశం అని నిర్మల సంతోషంగా సరేనంది. టీచరు ఉద్యోగం వదిలేసి సిరిసిల్ల వెళ్లింది. కొద్దిరోజుల్లోనే రాధ, నిర్మల మంచి స్నేహితులయ్యారు. నిర్మలను కూడా డాక్టర్ రాధమ్మ లాగే గౌరవిస్తున్నారు.

సిరిసిల్ల పాతబస్టాండ్ సమీపంలో ఉన్న రాధ హాస్పటల్ కొద్దిరోజులలోనే బాగా ప్రాచుర్యం పొందింది. ఇటు వెంకంపేట, సుందరయ్యనగర్, బద్దం ఎల్లారెడ్డి నగర్ అటు విద్యానగర్‌దాకా విస్తరించి ఉన్న పవర్‌లూం కార్మికులకు డాక్టర్ రాధమ్మ దేవతలా కనిపించింది. అందరిని ఆప్యాయంగా నవ్వుతూ పలకరించడం, నిర్మల ఆత్మీయంగా మందులు ఎలావాడాలో వివరించడం అందర్ని ఆకట్టుకుంది. పేదవాళ్ల డాక్టరమ్మగా స్థిరపడింది. రాసే మందులు తక్కువ. తీసుకునే ఫీజు తక్కువ. తన డబ్బులే కొంతకాలందాకా హాస్పటల్ నిర్వహణకు ఖర్చుచేసింది. రెండు లక్షల రూపాయలదాకా అలా ఖర్చుచేయడం తండ్రి సత్తయ్యకు నచ్చలేదు.

రాధ ఊహాత్మక ఆదర్శాల్తో పిచ్చిపని చేస్తోందన్నాడు సత్తయ్య.

"ఔను నాన్నా! నేను నిజంగా పిచ్చిదాన్నే" అంది రాధ.

కన్సల్టేషన్‌ఫీజు అయిదు రూపాయ్యలే కావడంతో సిరిసిల్లతో పాటు చుట్టుపక్కల ఊళ్లల్లోకూడా రాధమ్మ డాక్టరు పేరు బాగా పాకిపోవడంతో డాక్టర్లందరికీ రాధమ్మపట్ల అసూయ పెరిగిపోయింది.

ప్రతి బుధవారం గైనకాలజిస్టు లత, చిల్డ్రెన్ స్పెషలిస్టు అరుణ సిరిసిల్లలో రాధ క్లినిక్‌కు విజిటింగ్ డాక్టర్లుగా వెళ్తున్నారు.

అయిదు రూపాయలకే స్పెషలిస్టులు చూడ్డం ప్రజలకొక ఆశ్చర్యకరమైన విషయమైంది. ఆ తర్వాత అలవాటైంది. ప్రతి బుధవారం ముగ్గురు స్నేహితురాళ్ళకు తీరిక సమయాల్లో కాలేజీ అమ్మాయిల్లా భలే ఆనందంగా గడిచిపోతోంది.

అరుణతో "నువ్వు మేజర్‌వి. మైనారిటీ వయస్సు తీరినదానివి. ఇంకా మీ డాడీకి భయపడ్తూ అరవింద్‌కు నీ ప్రేమ గురించి చెప్పకుండా యింకెంత కాలం ఉంటావు? మేమంతా ఉండగా నీకేం భయం? నువ్వు ఊ అను. పెళ్ళి మేం జరిపిస్తాం" అన్నారు లత, రాధ.

అరుణ ఒక నిర్ణయానికొచ్చి సరేనంది.

అనుకున్నదే ఆలస్యం... కరీంనగర్‌లో శ్రీరాజరాజేశ్వర కళ్యాణ మండపంలో డాక్టర్ అరవింద్, డా॥ అరుణల పెళ్ళి విక్రాంత్ పట్టుబట్టి బాజాభజంత్రీలు లేకుండా మీటింగ్ పెళ్ళి పద్ధతిలో జరిపించాడు.

అరుణ తరపు బంధువుల్లో అరుణ తల్లి, మేనమామ, తమ్ముడు, చిన్నమ్మ, కొందరు స్నేహితులు తప్ప బంధువులు పెద్దగా రాలేదు.

ఇదే స్థాయి సంబంధం అరుణకు వెతికి చేయాలంటే పది లక్షల కట్నమైనా యివ్వాల్సి వచ్చేది. వాటితో పాటు రెండు లక్షల పెళ్ళి ఖర్చులు మిగిల్చిన ఈ పెళ్ళికి అరుణ తండ్రి గానీ, తండ్రి తరపు బంధువులు గానీ రాకపోవడం కులహంకారం రూపంలో స్వార్థాన్ని దాచిపెట్టడం తప్ప మరేమీ కాదు అని పెళ్ళిలో విక్రాంత్ కాస్త గట్టిగానే ఉపన్యాసం దంచాడు.

"తన ఆస్తిలోంచి పన్నెండు లక్షల రూపాయలు కూతురు పేరిట బ్యాంకులో డిపాజిట్ చేస్తే తప్ప అరుణను నా కూతురు అని తండ్రి ఆమె యింటికి రాకపోకలు సాగించే నైతిక హక్కు లేదు" అని విక్రాంత్ తెగేసి మైకు మైకంలో చేసిన హెచ్చరిక అరుణ తల్లికి మింగుడు పడలేదు.

తన భార్య నోటితో అది విన్న అరుణ తండ్రి దయాకర్‌రావు ఆశ్చర్య పోయాడు.

"వీడెవడయ్యా బాబు! ఆవలిస్తే పేగులు లెక్క పెట్టడంతో పాటు అంతరంగాన్ని పసిగట్టేవాడు! ఇలా బెట్టుగా తప్పించుకొని ఏడాది తర్వాత రాకపోకలు సాగించుకుంటే పరువుకు పరువూ, పైసలకు పైసలూ మిగుల్తాయనుకుంటే విక్రాంత్ రెండూ లేకుండా పెళ్ళి మీటింగ్‌లోనే దుమ్ము

దులిపాదని" పళ్ళు కొరికాడు తండ్రి దయాకర్‌రావు.

❖ ❖ ❖

"ఆధునిక వైద్యంలో కొన్ని అపోహలు" అనే అంశంపై సిరిసిల్లలో రాధ ఏర్పాటు చేసిన సెమినార్ ప్రజల్ని, మేధావుల్ని బాగా ఆకర్షించింది. ఇపుడు చేస్తున్న గర్భసంచి, అల్సర్, వగైరా ఆపరేషన్లు తొంభయి శాతం పైగా అనవసరమైనవే అని, డాక్టర్లు తమ సంపాదన కోసం ప్రజల్లో ఆపరేషన్ల క్రేజీ పెంచుతున్నారని, డాక్టర్లు రాసే మందుల్లో సగానికి పైగా మెడికల్ షాపులో తన వాటాగా పెరిగే లాభాల కోసమేనని, తక్కువ మందులు రాసే డాక్టరే గొప్ప డాక్టరని, ఏ ఏ రోగాలు ఎలా కొద్దిపాటి జాగ్రత్తలతో ఎలా మందులు లేకుండానే నయమవుతాయో చెప్పిన విషయాలు ప్రజల్ని బాగా ఆకర్షించాయి.

సంపాదన కోసమే వలస వచ్చిన డాక్టర్లకు రాధ పెద్ద సమస్య అయి కూర్చుంది. పేషెంట్లుగా వస్తున్న పేదల్ని, వారి పిల్లల్ని, వారి స్థితిగతులు చూస్తుంటే నిర్మలకు వారిపట్ల సానుభూతి పెరుగుతోంది. పవర్ లూం కార్మికుల్ని, వారి కుటుంబ సభ్యుల్ని చూస్తుంటే తన రక్త సంబంధీకులే అన్నంతగా బాధపడుతోంది.

"ఇక నీతో సంసారం చేయను. నా బతుకు నేను బతుకుతానని" లత వదిన అయిలమ్మ తన పిల్లల్ని తీసుకొని ఆడపడుచు డాక్టర్ లత యింటికి చేరింది.

"ఆ అటెండర్ ఉద్యోగానికి లీవు పెట్టి మీ అన్నను యిక్కడ మెడికల్ షాపు పెట్టుకోమనరాదూ! ఇక్కడ అతనికి సోషల్ మొబిలిటీ, సోషల్ స్టేటస్ పెరిగి మన భయంతో కాస్త మారుతాడేమో" అని లతకు సూచించాడు విక్రాంత్.

ఆరు నెలల తర్వాత విక్రాంత్ మాటే వాస్తవమైంది.

సంపాదన, ప్రజల్లో గుర్తింపు పెరుగుతున్నకొద్దీ అరవింద్ ఆలోచనలు మారసాగాయి.

పెద్దకోడలు అరుణతో ఆ యింట్లో వంటల తీరే మారిపోయింది.

సావిత్రి బీడీలు చేయడం మానేసింది.

బట్టలు నేసినపుడు ముసలివాళ్ళలా ఎండుకుపోయి వున్న దేవక్క చంద్రయ్య, బీడీలు చేసిన సక్కుబాయి పదేళ్ళు వయస్సు పైబడితే అందుకు భిన్నంగా పదేళ్ళ వయస్సు తగ్గినట్టుగా ఆరోగ్యంతో, ఆత్మవిశ్వాసంతో అందంగా పుష్టిగా నిగనిగలాడుతున్నారు.

అరవింద్ తమ్ముడు ఆనంద్ అచ్చం రాజకీయ నాయకుడిలా మారిపోయాడు.

పేదరికం కారణంగా తెగిపోయిన బంధుత్వాలన్నీ యిపుడు పచ్చగా చిగురించాయి.

డాక్టర్ అరవింద్, డాక్టర్ విక్రాంత్ లెక్చరర్ తమకు ఎలా దగ్గరి బంధువో చిలవలు పలవలుగా చెప్పుకొని ఎక్కడెక్కడివాళ్ళో తమ చుట్టూ ఉన్నవాళ్ళలో పరపతి పెంచుకుంటున్నారు.

వాళ్ళ తరపున వచ్చే పేషెంట్లకు కన్సెషన్స్ యివ్వడంతో అటు బంధుత్వమూ, యిటు వ్యవహారమూ రెండూ కలగల్సి పోయాయి.

మూడు నెలలకోసారి డాక్టర్ల బృందంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అరవింద్ కార్యక్రమాల్లో ఒకటైంది.

ప్రయివేటు స్కూల్లు, కాలేజీలవాళ్ళు తమ ఫంక్షన్స్‌కి డాక్టర్ అరవింద్‌ని, డాక్టర్ అరుణని ముఖ్య అతిథిగా పిలుస్తున్నారు.

బిజీ అయిపోయిన డాక్టర్ అరుణ మూడో ఏడు పడ్డంతోనే తన కొడుకుని నర్సరీ బడికి పంపాలనుకుంది. దేవక్క గొడవ చేసింది. మాకెలా పొద్దు పోవాలని. అరుణ తన ఆలోచన విరమించుకుంది.

విక్రాంత్‌కు మంచి సోషియాలజిస్టుగా జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోంది.

విక్రాంత్ తల్లి సక్కుబాయి మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచింది.

ఆమె గెలుపులో డాక్టర్ అరవింద్, విక్రాంత్, సావిత్రి, ఆనంద్, శ్రీనివాస్, దేవక్క చంద్రయ్య, నిర్మల, తదితర బంధుమిత్రుల ప్రతిష్ట ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో బాగా ఉపకరించింది.

సక్కుబాయి తన జీవితంలో ఏనాడూ కలలోనైనా ఊహించని విధంగా కౌన్సిలర్ కావడం, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కావడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

కోరుట్ల, జగిత్యాల, సిరిసిల్ల, ఆర్మూర్, మెట్‌పెల్లి, తదితర ఊళ్ళల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్లు గానో, వైస్ ఛైర్‌పర్సన్‌లు గానో, కౌన్సిలర్లు గానో, సర్పంచులు గానో, బీడీ కార్మికురాళ్ళో, మాజీ బీడి కార్మికురాళ్ళో ఎన్నిక కావడంతో వాళ్ళంతా ఒక బృందం అయిపోయారు.

కొడుకు విక్రాంత్, కోడలు డాక్టర్‌లత, అల్లుడు ఆనంద్, డాక్టర్‌అరవింద్‌తో పాటు శ్రీనివాస్ వల్ల సక్కుబాయి ఆ మహిళా ప్రతినిధుల బృందానికి పెద్దమ్మయిపోయింది. నాయకురాలైపోయింది.

"అరవింద్! నువ్వూ నేనూ ఫెమినిస్టులను పెళ్ళి చేసుకొంటే మన కుటుంబాలు యిలా అభివృద్ధి అయ్యేవేనా! లేదా మనం మన స్వార్థం, మన సుఖాల కోసం సిటీలో స్థిరపడినా మన కుటుంబాలు, మన బంధువులు, యిలా వానతో నీటిమట్టం అంతటా పెరిగినట్టు పెరగడం సాధ్యమయ్యేదా...!

"...కాకపోతే మనం వ్యక్తిగతంగా ఎవరికీ నీడనివ్వని తాడి చెట్టులా ఇంకా ఎదిగి ఉండేవాళ్ళమేమో! మన పిల్లలు మన బంధువుల్తో సంబంధాలు కోల్పోయి, మన సంపాదన, సోషల్ స్టేటస్‌తో క్రీమీ లేయర్ ఎలైట్ క్లాసుగా పచ్చి స్వార్థపరులుగా మారే క్రమం మొదలయ్యేది. ఏమంటావు?" అంటూ అడిగాడు విక్రాంత్.

"పైగా యిక్కడ ఉన్న గుర్తింపు గౌరవం, ప్రేమ సిటీలో ఎందుకుంటుంది? అక్కడ మనం మన సమాజానికి చేసే మేలంటూ ఏముంటుంది?" అని గొంతుకలిపాడు అరవింద్.

అప్పుడే యింట్లోకి వచ్చిన డాక్టర్ లత నవ్వుతూ అడిగింది.

"బావా బామ్మరుదులు చాన్రోజుల తర్వాత ఏదో తీరికగా చర్చిస్తున్నారు."

అరవింద్ జరిగిన చర్చ చెప్పాడు. లత నవ్వుతూ అంది.

"అయితే మీకు ఫెమినిజం మీద యింకా కోపం పోలేదన్నమాట! అసలు యిదంతా ఫెమినిజం వల్లే సాధ్యపడింది. ఫెమినిజం వల్లే స్త్రీలను సమానంగా గౌరవిస్తున్నారు. ఫెమినిజం వల్లే మహిళలకు మూడోవంతు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు ఏర్పడ్డాయి...

"ఈ రిజర్వేషన్ల వల్లే అత్తమ్మలాంటి వాళ్ళు ఎందరో స్త్రీలు గెలిచారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ లవారీగా మహిళలకు రిజర్వేషన్లు లేకపోయి ఉంటే అత్తమ్మలాంటి వారు గెలిచేవారా? ఏ ఓసీ స్త్రీలో గెలిచి ఉండేవాళ్ళు. నేనూ, రాధా, అరుణా ఫెమినిస్టులం కాదని ఎందుకనుకున్నారు? మీకు ఎదురు తిరగకుండా వినయంగా సంసారాలు చేస్తున్నందుకా?"

"అది కాదు లతా!" అంటూ విక్రాంత్ ఏదో చెప్పబోయాడు.

లత విన్పించుకోలేదు.

"మీ దృష్టిలో పీడిత వర్గ, పీడితకుల, రూరల్ (గ్రామీణ) దృక్పథంతో పని చేసే ఫెమినిస్టులు. ఫెమినిస్టులుకారా? మీ దృష్టిలో లూజ్ క్యారక్టర్ ఉంటేనే ఫెమిస్టులా? లేక అర్గనైజ్డ్ ఓసీ క్యాస్ట్స్ ఎలైట్ ఫెమినిస్టులే ఫెమినిస్టు లనుకుంటున్నారా?...

"అంటే మీలోనూ అర్గనైజ్డ్ ఓసీ ఎలైట్ లూజ్ క్యారక్టర్ ఫెమినిస్టులే ఫెమినిస్టులనే దృక్పదం హాంగోవర్‌గా కొనసాగుతోందన్న మాట. మేన్‌స్ట్రీం మీడియా మీపైకూడా ఎంత ప్రభావంవేస్తోంది?" అంటూ డాక్టర్ లత ఉపన్యాసం దంచింది.

విక్రాంత్, అరవింద్‌లు ఆ వాగ్దాటికి అవాక్కయ్యారు.

ఈమె తనకోడలేనా అని కొత్తగా ఆశ్చర్యపోయింది సక్కుబాయి. మెచ్చుకోలుగా చూసి అంది.

"ఈసారి ఎమ్మెల్లేగా పోటీ చేయికోడలా! ఎస్సీల్లో యింత తెలివి ఉన్నప్పుడు రిజర్వేషన్ సీట్లో పోటి ఎందుకు చేయద్దు?"

"నాకా ఉద్దేశంలేదు అత్తమ్మా! ఒకవేళ పోటీ చేసినా ఎస్సీ రిజర్వేషన్‌లో ఎందుకు పోటీ చేస్తాను. నేను బీసీల యింటి కోడల్ని. చేస్తే బీసీల రిజర్వేషన్ కోటాలో పోటీ చేస్తాను. లేదా జనరల్ వుమెన్ రిజర్వేషన్‌లో పోటీ చేయాలి. ఎస్సీ రిజర్వేషన్ మాత్రం మా ఎస్సీలకే అందాలి."

"అట్లగాదే కోడలా! ఇందిరాగాంధీ తురుకాయనను చేసికొన్నా ఆమె బ్రాహ్మణామెగానే బతకలేదా? ఆమె కొడుకు రాజీవ్ గాంధీ తురకమతం గాకుండా క్రైస్తవుల పిల్లను చేసికొన్నా బ్రాహ్మణుడని పేరు పోలేదా? నువ్వు కూడా నీకులం హక్కులు పొందవచ్చు గదా!" అంది సక్కుబాయి.

"అత్తమ్మా! దానివల్ల నాకు లాభం జరగవచ్చు. మీరూ మా అమ్మా, అన్నయ్యా సంతోషించవచ్చు. కాని ఎస్సీలకు అన్యాయం జరుగుతుంది. పై కులాలలో యింటర్ కాస్ట్ మ్యారేజ్ చేసికొన్న స్త్రీలు నిజంగా ఎస్సీలను ప్రేమించేవాళ్ళయితే ఎస్సీకోటాలో పోటీ చేయకూడదు...

"అలాగే ఓసిలు కింది కులాల్లో మ్యారేజ్ చేసికొన్న స్త్రీ ఉదాహరణకు అరుణ ఓసీ. కింది కులం రిజర్వేషన్‌లో అరుణ పోటీ చేసినా అన్యాయమే జరుగుతుంది. అయినా అరవింద్ నన్నెక్కడ పోటి చేయనిస్తాడు. తానే పోటీ చేద్దామని దూరాలోచనతో తమ్ముణ్ని ముందుగా రాజకీయాల్లోకి దించాడు.

ఇపుడు తానే పోటీ చేద్దామని తయారైనాడు" నవ్వుతూ అంది డాక్టర్ లత.

"మరీ అట్లా దుష్ప్రచారం చేయకు. ఆ మాటకొస్తే నేను పోటీ చేయాలనుకోవడం తప్పా?" అన్నాడు అరవింద్.

"విక్రాంత్! నీ అభిప్రాయం ఏమిటి?"

"నా అభిప్రాయంకన్నా డా॥రాంమనోహర్ లోహియా నలభయి ఏళ్ళ కింద చెప్పిన మాట చెప్తాను. 1956లోనే చాలా మీటింగుల్లో ఆయన ఏం చెప్పాడంటే అయిదారేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో బీసీలు అధికారం చేపడ్తారని అన్నాడు. కావాలంటే తెలుగు అకాడమీ అనువాదం చేసి ప్రచురించిన అతని ప్రసంగాల సంపుటాల్ని చదవండి."

"ఏంటీ? 1956లో ఆమాట అన్నాడా? ఏం చూసి అన్నాడు. ఎందుకు అలా జరుగలేదు?" అని ప్రశ్నలు కురిపించాడు అరవింద్."

ఇప్పటికైనా కనుచూపుమేరలో లేని బీసీల అధికారం గురించి నలభయి ఏళ్ళకిందే ఎందుకు ఊహించాడు?"

"మొన్న ఢిల్లీలో ఓ నేషనల్ సెమినార్ జరిగింది. 'క్యాస్టుక్లాసు జండర్ అన్‌డెవలప్డ్ రీజియన్స్ అండ్ పొలిటికల్ పవర్' మీద మూడురోజులు జరిగిన సెమినార్‌లో అద్భుతమైన విషయాలు ప్రెజెంట్ చేశారు. నా పేపర్లో మన ఈ సమస్యగురించే చర్చించాను" అంటూ వివరించాడు విక్రాంత్.

"ప్రాథమిక, సెకండరీ విద్యకు మొదటి ప్రణాళికలో ప్రతిపాదించిన బడ్జటుతో పల్లెల్నించి మొదటితరం అక్షరాస్యులు కొత్తగా ఏర్పడడం మొదలైంది. పారిశ్రామికాభివృద్ధిలో బీసీల చొరవ పెరిగింది. దాన్ని చూసి రామమనోహర్‌లోహియా మన రాష్ట్రంలో బీసీలు త్వరలో అధికారంలో కొస్తారని అన్నాడు.

"తాలుకా కేంద్రాల్ని విద్యాకేంద్రాలుగా పరిశ్రమల అభివృద్ధి కేంద్రాలుగా వికేంద్రీకృత అభివృద్ధి విధానం అమలు జరిగి ఉంటే లోహియా కల నిజమయ్యేది. కాని అలా జరుగలేదు. పరిశ్రమలు, విద్యాకేంద్రాలు కొన్ని సిటీ పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమయ్యాయి. నెహ్రూ హయాంలో భిలాయ్, రూర్కెలా, నాగార్జున సాగర్ వంటి కేంద్రీకృత భారీ పరిశ్రమల్ని, భారీ ప్రాజెక్టుల్ని చేపట్టారు. వాటికి కావల్సిన స్కిల్‌గానీ, పెట్టుబడిగానీ బీసీల స్తోమతకు మించినవి. అందువల్ల దాన్ని అందుకోలేకపోయారు...

"భారీ ప్రాజెక్టుల వల్ల భూములున్న భూస్వామ్య, వ్యవసాయకులాల వాళ్ళ పంట, రాబడి, స్తోమత పెరిగి వాళ్ళే తిరిగి రాజకీయనాయకులుగా పై స్థాయి అధికారులుగా, పారిశ్రామిక వేత్తలుగా, కాంట్రాక్టర్లుగా రూపాంతరం చెంది అభివృద్ధి చెందారు. భారీ ప్రాజెక్టులు, భారీ పరిశ్రమల వల్ల ఎస్సీ, బీసీ, ఎస్టీలు కార్మికులుగా మారిపోవాల్సి వచ్చింది...

"ఎందుకంటే వాళ్ళ వద్దసరైన సర్‌ప్లస్‌గానీ, పెట్టుబడిగానీ, వ్యవసాయ భూములుగానీ చాలా తక్కువ. చైనాలో జరిగినట్టు వికేంద్రీకృత అభివృద్ధి జరిగివుంటే బీసీలు. ఎస్సీలే అన్ని రంగాల్లో తమ వాటా తాము పొందేవారు. అది యితరుల పరమైంది." అంటూ తన సెమినార్ పత్రం సారాంశం వివరించాడు విక్రాంత్.

"ఇంతకూ నన్ను పోటీ చేయమంటావా? వద్దంటావా? ఇప్పుడు బీసీల టైం వచ్చిందా?" ఉత్సుకతతో అడిగాడు అరవింద్.

"అలా ఒక్కమాటలో చెప్పడం కష్టం అరవింద్. బీసీల స్వకృతాపరాధం వారిని పట్టిపీడిస్తోంది. ఈ మాట బహిరంగంగా అంటే బీసీలు నన్ను తిడ్తారు. కాని వాస్తవం అదే. ఉదాహరణకు నారాయణ సేటు చేనేత సహకార సంఘంలో చురుకుగా పని చేసి దాన్నే ముంచి అంటే స్వంత కులస్తులను ముంచి పైకి వచ్చాడు. దాంతో అతన్ని అతని కులస్తులే నమ్మడానికి నిరాకరించారు. అలా అతను వ్యాపారానికే పరిమితమయ్యాడు...

"ఇలా మొదటితరంలో ఎదిగిన బీసీలు రేపటి పిల్లకన్నా యివాళటి గుడ్డు నయం అని పగలకొట్టుకొని తిన్నారు. దాంతో వాళ్ళు ఎదగలేదు. రెండో తరంలో అందరూ రాజకీయాలంటే నీచంగా చూసి ఉద్యోగాలు, వ్యాపారాల్లో భద్రత వెతుక్కున్నారు. అట్లా రెండో తరంలో నష్టపోయారు.

"మొదటితరం ఎలైట్ సెక్షన్‌గా మారడం వల్ల మూడో తరం నష్టపోయింది. ఉదా॥కు నారాయణసేటు నిర్మలను చేసికొమ్మని, నీచదువుకయ్యే ఖర్చు నేనే పెడ్తానని నీ యింటర్ అప్పుడు, నీ లాంగ్‌టర్మ్ కోచింగ్ అప్పుడు అని వుంటే నువ్వలా నారాయణ సేటు అల్లుడివై ఉంటే అతడు చేసిన పాపం పరిహారమై, అతని పెట్టుబడి, ప్రతిష్ఠ, స్తోమత నీకు పెట్టుబడి అయి నువ్వు ఈ పాటికే ఎమ్మెల్లే అయి ఉండేవాడివి...

"అప్పుడు మీ బావమరిది శ్రీనివాస్ ఏ కార్పోరేషన్ లోనో, దేవస్థానంలోనో ఛైర్మెనో, మెంబరో అయి వుండేవాడు. ఆ కుటుంబం యిప్పటిలా దివాళా తీసి

పతనమై ఉండేది కాదు. అది జరగకపోవడం వల్ల మనం తిరిగి మళ్ళీ కొత్తగా మొదటి నుంచి ప్రారంభించాల్సిన స్థితిలో పడిపోయాము."

"ఇంత అవగాహన ఉన్న నువ్వు పోటీ చేయడమే మంచిది అనిపిస్తుంది. యిప్పుడు నువ్వు ఉద్యోగం చేయాల్సిన అవసరం కుడా లేదు" అన్నాడు అరవింద్.

విక్రాంత్ నవ్వాడు. "ఎద్దున్నోనికి బుద్దుండదు. బుద్దున్నోనికి ఎద్దుండదు. అనే సామెత వినలేదా? సామాజిక శాస్త్రాలు తెలియడం వేరు. రాజకీయాలు చేయడంవేరు. మొదటిది థీయరీ. ఎవరైనా నేర్చుకోవచ్చు. రెండోది ప్రాక్టీసు. ప్రాక్టీసులోనే మన సత్తా తెలుస్తుంది. బాగా తెల్సిన వాళ్ళే నాయకులుగా ఎన్నికయ్యే సమర్థత సాధించుకొని ఉంటే తత్వవేత్తలు, మేధావులు, రాజనీతి శాస్త్రజ్ఞులే నాయకులై వుండేవారు."

"అరుణ వాళ్ల డాడీ ఎలక్షన్లలో పోటీ చేస్తాడని ఎవరో అన్నారు."

ఏదో గుర్తొచ్చినట్టు అకస్మాత్తుగా అడిగింది లత.

"అన్నట్టు అరవింద్! మీ మామయ్య దయాకర్‌రావు అరుణ పెళ్ళికోసం యివ్వాల్సిన కట్నం, పెళ్ళి ఖర్చు కల్సి పన్నెండు లక్షలు అని విక్రాంత్ అప్పుడు అన్నాడు గదా! ఈ ఆరేళ్ళలో బ్యాంకు వడ్డీ ప్రకారమే అవి యిరవైనాలుగు లక్షలవుతాయి. ఎలక్షన్ల ఖర్చులకు పనికొస్తాయి" అంటూ నవ్వింది డాక్టర్ లత.

"ఆ మాటంటే రేపే మీరు అతని పోస్టుమార్టం కెళ్ళాల్సి వస్తుంది. అతను ఉరేసుకు ఛస్తడు" అంటూ నవ్వాడు విక్రాంత్.

"లెక్క లెక్కనే. సుట్టమైతే ఇంటికాడబుక్కెడంత తినుమను. కాని లెక్క లెక్కనే అని అడుగేందోయి అల్లుడా?" అంది సక్కుబాయి.

"నేనేదో నవ్వులాట కన్నాను అత్తమ్మా! ఇలా కూతురికివ్వాల్సిన 24 లక్షలు అతని వద్ద సర్‌ప్లస్‌గా మిగిలిపోయే సరికి యిప్పుడాయన ఆ పైసల్తో తనకు టికెట్ తెచ్చుకుంటున్నాడు. రేపు గెలుస్తాడు. ఇలా మన త్యాగాలవల్ల వాళ్ళ సర్‌ప్లస్ పెరిగి తిరిగి మన మీదే పెత్తనం చెలాయిస్తారన్నదే నా బాధ" అంది లత.

అలా చర్చ ముగిసింది. అయితే వీళ్ళెవరూ ఊహించని విధంగా రాధ ఎన్నికల్లో టికెట్ సంపాదించిందని తెల్సి అందరూ ఆశ్చర్యపోయారు. రిటైర్డు కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమీషనర్ సత్తయ్య ముప్పయేళ్ళ పరిచయాల్తో పావులు కదిలించి సాధించి పెట్టాడు.

"విక్రాంత్! తాలూకా కేంద్రంలో మనం బలంగా ఉంటేనే సరిపోదు. రాజధాని కేంద్రంలో కూడా మనదంటూ ఒక లాబీ ఉంటేనే అన్నిటా ఎదగడం సాధ్యం" అన్నాడు అరవింద్.

"నిజమే" అన్నాడు విక్రాంత్.

అరవింద్, లత, విక్రాంత్, నిర్మల, అరుణ, సక్కుబాయి తదితరులందరి సహకారంతో ఎమ్మెల్యేగా నాలుగువేల ఓట్ల మెజారిటీతో గెలిచింది రాధ.

అరుణ తండ్రి దయాకర్ రావు నిజామాబాద్ జిల్లాలో ఓడిపోయాడు.

అరుణ మొత్తంగా డీలా పడిపోయింది. ఇల్లు తప్ప ఉన్న ఆస్తులన్నీ కరిగి పోయాయి.

"అరుణా! మన భావాలు గెలిచాయి. మీ నాన్న ఓడినందుకు నాకూ బాధగానే ఉంది. కానీ ఓడిపోవడమే చారిత్రక అవసరం. ఓడిపోవడం వల్ల అతని సర్‌ప్లస్ తగ్గింది. గెలిచివుంటే ఆ సర్‌ప్లస్‌తో పాటు, పెత్తనం పెరిగి ఉండేది. తద్వారా అది అతని కులాహంకారాన్ని మరింత పెంచేది. అలా జరగనందుకు సంతోషించాలి మనం." అనునయంగా అంది డాక్టర్ లత.

"వదినా! ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నావు. నాకు ఆ బాధ కన్నా నువ్వన్నమాటే కష్టంగా ఉంది" విషాదంగా అంది అరుణ.

"సారీ అరుణా! నిన్ను బాధ పెట్టాలని కాదు" అని ఓదార్చింది లత. అరవింద్ ఎంత ఓదార్చినా కాదని ఒంట్లో బాగాలేదని పిల్లల్ని తీసుకొని నిజామాబాద్ వెళ్ళిపోయింది అరుణ.

ఎమ్మెల్యేగా గెలిచిన రాధ జీవితాన్ని కూడా గెలుచుకుంది. క్లాసుమేటూ, డైవోర్సీ అయిన డాక్టర్ రాజేశ్వర్‌తో రాధ పెళ్ళి అరవింద్ పెళ్ళికన్నా ఘనంగా జరిగింది.

"నిర్మలా! నీ పెళ్ళెపుడో!" నవ్వుతూ అడిగింది డాక్టర్ లత.

"నాకు రాధక్కలా నాన్న లేడు గదా! దారి చూపడానికి" అని నవ్వింది నిర్మల. ఆ నవ్వులో విషాదంపొర. మళ్ళీ తనే అంది.

"నాన్న నన్ను ఆనంద్ బావకిచ్చినా నా బతుకిలా అయ్యేది కాదు."

"నిర్మలా! గతం ఎపుడూ తిరిగిరాదు. గతాన్ని తలుచుకొని ఏడ్చి లాభంలేదు. గతాన్ని ద్వేషించి లాభం లేదు. ప్రస్తుతం ఏం చేయాలో గతం

తాలూకు అనుభవాల్తో వర్తమానంలో నిలబడి వాస్తవికంగా ఆలోచించి గెలుచుకోవడమే జీవితం. ఇంకొన్నాళ్ళుపోతే నీకూతురే పెళ్ళికెదిగేట్టుంది. ఏం సాధించినా యింకో రెండుమూడేళ్ళలోనే సాధించుకోవాలి" అంది లత.

"ఎన్ని కష్టాలు పడితే, ఎన్ని ఓర్చుకుంటే కాంతయ్య పేరుకచ్చిండో ఎరికేనా కోడలా? రేపు నిర్మల ఎవర్నైనా చేసుకుంటే ఆ పిల్లను వచ్చినోడు సరిగా చూస్తడో లేదో" అంది సక్కుబాయి.

"ఇప్పటికే ఆలస్యం అయింది. సరైన నిర్ణయం తీసుకో. ఒక ఏడాది రాజకీయాల్లో రాధతో తిరుగు, అనుభవం పెరుగుతుంది." అన్నాడు అరవింద్.

"నాకు రాజకీయాలమీద ఆసక్తిలేదు. నా పిల్లల భవిష్యత్తు ముఖ్యం" అంది నిర్మల.

"నిర్మలక్కది తల్లి మనస్సు." అంటూ అభినందించింది డాక్టర్ అరుణ.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

సెప్టెంబర్ 1999